



తొలి పావంచా వద్ద కొబ్బరికాయ కొడుతున్న భక్తుడు



తొలి పావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టేందుకు ఏర్పాట్లు.. సిద్ధం చేసిన క్యూలైన్లు

సింహగిరికి ఉత్సవ శోభ

నేడే గిరి ప్రదక్షిణ

మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం

- అప్పన్న ప్రచార రథాన్ని ప్రారంభించనున్న దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు, స్థానిక శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు
- విస్తృత ఏర్పాట్లు చేసిన అధికారులు
- దారిపొడవునా తాగునీరు, వైద్య శిబిరాలు
- 3,000 మందితో బందోబస్తు

సింహాచలం, జూలై 8 (ఆంధ్రజ్యోతి):

సింహ'గిరి ప్రదక్షిణ' బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం కానున్నది. కొండదిగువన తొలిపావంచా వద్ద స్వామివారి పుష్పతేరు (ప్రచార రథం)ను దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు, స్థానిక శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు జెండా ఊపి లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గోవింద నామస్మరణలతో గిరి ప్రదక్షిణకు ఉపక్రమిస్తారు.

ఏటా ఆషాఢ మాసంలో శుక్లపక్ష చతుర్దశినాడు లక్షలాది మంది కొండంత భక్తితో వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువుదీరి ఉన్న సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేయడం ఆచారంగా వస్తోంది. భక్తులు కొండ దిగువన తొలిపావంచా వద్ద ప్రారంభించి అడివివరం, ముడసర్లోవ, హనుమంతువాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, ఎం.వి.పి. డబుల్ రోడ్డు, వెంకోజీపాలెం, సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్, మాధవధార, మురళీనగర్, కుమారి కల్యాణ మండపం, పాతగోశాల మీదుగా సింహాచలం చేరుకుని (మొత్తం 32 కిలోమీటర్లు) ప్రదక్షిణ ముగిస్తారు. బుధవారం ప్రారంభంకానున్న గిరి ప్రదక్షిణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లన్నీ పూర్తిచేసింది. తొలిపావంచా వద్ద మాత్రమే కాకుండా పురాతన భైరవద్వారం (పాత తొలిపావంచా) వద్ద కొబ్బరికాయలు కొట్టేందుకు ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. సుమారు ఐదు నుంచి ఆరు లక్షల మంది హాజరవుతారని భావించి అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మూడు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు. ప్రతి 6 కి.మీ.కు అధికారులతో బృందాన్ని పెట్టారు. ఎక్కడికక్కడ మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం కల్పించారు. ఏదైనా అవసరమైతే ఫోన్ ద్వారా చెప్పడానికి టోల్ ఫ్రీ నంబర్లను దారి పొడవునా డిస్‌ప్లే చేశారు. అలాగే ప్రదక్షిణ మార్గంలో 750 విద్యుద్దీపాలు, 32 ప్రాంతాల్లో 200 వాట్స్ సామర్థ్యం కలిగిన హైమాస్ట్ లైట్లు పెట్టారు. కొండ పైకి వెళ్లేందుకు 50 బస్సులను ఉచిత సర్వీస్‌లుగా నడుపుతున్నారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మంగళవారం రాత్రి సింహాచలం వెళ్లి ఏర్పాట్లు పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అప్పుమర్ వద్ద ... మిగతా 6వ పేజీలో



సింహగిరిపై ఆలయం చుట్టూ ప్రదక్షిణకు ఏర్పాట్లు

భక్తులకు సూచనలు

- చక్కెర వ్యాధిగ్రస్తులు కాళ్లకు చెప్పులు లేకుండా నడవరాదు.
- గుండె జబ్బు ఉన్నవారు గిరి ప్రదక్షిణ చేయరాదు.
- బీపీ ఉన్నవారు నిర్దేశిత మందులు వేసుకొని నడవాలి. అత్యవసర పరిస్థితుల్లో దగ్గరలో ఉన్న వైద్య శిబిరంలో బీపీ తనిఖీ చేయించుకోవాలి.
- నీరసంగా ఉన్నప్పుడు ఓఆర్ఎస్ తీసుకోవాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి.
- గంటకు ఒకసారి తగినంత మోతాదులో మంచినీరు తీసుకోవాలి.
- అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలి.
- నడిచే సమయంలో శరీరానికి బాగా గాలి తగిలేలా వదులుగా ఉన్న దుస్తులను ధరించాలి.
- ఆయాసం వస్తే వెంటనే ఆగి, తగినంత విశ్రాంతి తీసుకోవాలి. అవసరమైతే వెంటనే వైద్య సాయం పొందాలి.

సింహగిరి ప్రదక్షిణ భూ ప్రదక్షిణతో సమానం



భక్తుల విశ్వాసం

- కోర్కెలు నెరవేరుతాయని నమ్మకం

సింహాచలం, జూలై 8 (ఆంధ్రజ్యోతి):

భారతీయ సంస్కృతికి మూలం వేదాలు. వేదం ప్రకృతిని పరమాత్మ స్వరూపంగా చెప్పింది. అందుకే అనాదిగా భారతీయులు చెట్లను, పుట్టలను, నదులను, సముద్రాలను, పర్వతాలను పూజిస్తుంటారు. పర్వతాలకు భూధరాలని పేరు. అంటే భూమి ధరించేవని అర్థం. వేదాల ప్రకారం విష్ణుః పర్వతానాం అధిపతిః. అందుకే పర్వతాలు పూజించబడుతున్నాయి. భూమి సమతుల్యతను కాపాడేవి పర్వతాలు. సాధారణంగా స్వయంభువుడుగా భగవానుడు వెలసిన క్షేత్రాలన్నీ అధిక శాతం పర్వతాలపైనే ఉంటాయి. అదే పర్వతాలపై పురాణాల కాలంలో మునులు, యోగులు తపస్సులు చేసి జ్ఞానసముపార్జన చేశారు. అటువంటి అనేక దైవీ భావనలు ఉండడం చేతనే పర్వతాలను పూజించడం, వాటి చుట్టూ ప్రదక్షిణలు చేయడం వేదకాలం నుంచే జరుగుతున్నట్టు విజ్ఞులు చెబుతారు.

వరాహ లక్ష్మీనృసింహస్వామి ద్వయావతారుడుగా వెలసిన దివ్యధామం సింహగిరి. అందుకే సింహగిరి చుట్టూ ప్రదక్షిణం చేయడం భూప్రదక్షిణతో సమాన ఫలితాన్ని ఇస్తుందని చెబుతారు. సింహగిరి చుట్టూ ప్రదక్షిణలు చేసిన వారికి విద్యాభివృద్ధి, ఉద్యోగప్రాప్తి, వివాహ అనుకూలత వంటివి ఈడేరుతాయని పెద్దలు చెబుతుంటారు. కోర్కెలు లేకుండా సింహగిరి ప్రదక్షిణ చేసినవారు ఇహపర సౌఖ్యాలు పొందుతారని పండితుల మాట. భౌతికంగా సింహగిరి చుట్టుకొలత 32 కిలోమీటర్లు. సింహాచల క్షేత్ర మహత్మ్యం ప్రకారం హిరణ్యకశ్యపుని ... మిగతా 6వ పేజీలో



గిరి ప్రదక్షిణకు 200 ప్రత్యేక బస్సులు

ద్వారకా బస్‌స్టేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి):

గిరి ప్రదక్షిణను పురస్కరించుకుని ఆర్టీసీ యాజమాన్యం 200 ప్రత్యేక బస్సులు నడపనున్నది. గురువారం ఉదయం 5.00 నుంచి శుక్రవారం సాయంత్రం 5.00 గంటల వరకూ ఈ ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేయనున్నట్టు రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. ద్వారకా బస్‌స్టేషన్, గాజువాక, రామకృష్ణా బీచ్, కొత్తవలస, సింధియా, ఉక్కునగరం, కొత్తవలస, తదితర ప్రాంతాల నుంచి కొండ దిగువన తొలి పావంచా వరకూ 150 బస్సులు నడపనున్నామన్నారు. అలాగే కొండ దిగువ నుంచి పైకి షటిల్ సర్వీసులుగా 50 బస్సులు నడపనున్నట్టు వెల్లడించారు. రీజియన్‌లో ఏడు డిపోల మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్‌వైజర్లు, కంట్రోలర్లు ప్రధానకూడళ్లలో ఉండి ట్రాఫిక్‌ను నియంత్రించనున్నారని పేర్కొన్నారు.

ఇక్కడ పనిచేయడం ఇష్టం లేకుంటే చెప్పండి

- ఇంత అస్తవ్యస్త పరిస్థితులు గతంలో ఎన్నడూ చూడలేదు
- గోడకడితే కూలిపోతుంది.. షెడ్ వేస్తే పడిపోతుంది
- సింహాచలం దేవస్థానం అధికారులపై ఎమ్మెల్యే గంటా ఆగ్రహం



సమావేశంలో అధికారులతో ఎమ్మెల్యే గంటా

సింహాచలం, జూలై 8 (ఆంధ్రజ్యోతి):

'గోడకడితే కూలిపోతుంది, షెడ్ వేసినా కూలిపోతుంది. ఉద్యోగుల బదిలీలు పద్ధతి అనేదే లేకుండా ఇష్టానుసారంగా చేస్తున్నారు. ఇంత అస్తవ్యస్త పరిస్థితులు గతంలో ఎన్నడూ చూడలేదు'...అంటూ సింహాచలం దేవస్థానం అధికారులపై భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సింహగిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై మంగళవారం ఈఓ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ చందనోత్సవంలో గోడకూలి భక్తులు మరణించిన దుర్ఘటనను మరువకముందే గిరిప్రదక్షిణ ఏర్పాట్లలో షెడ్ కూలడం భక్తులను ఆందోళనకు గురిచేసిందన్నారు. ఇటువంటి తప్పిదాలతో సింహాచలం దేవస్థానం ఇమేజీని మసకబారిస్తున్నారన్నారు. 'ఇన్‌చార్జి ఈఓ అని మీరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?, ఇక్కడ పనిచేయడం ఇష్టం లేకుంటే మీఇష్టం'...అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిపావంచా వద్ద షామియానాల ఏర్పాటుకు బదులు షెడ్ నిర్మాణం ... మిగతా 6వ పేజీలో

కేకే లైన్‌లో రైళ్ల పాక్షిక రద్దు

విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి):

కేకే (కొత్తవలస-కిరండూల్) లైన్‌లో రైళ్ల పాక్షిక రద్దు, గమ్యాల కుదింపు కొనసాగుతోంది. కిరండూల్ రైళ్లతోపాటు హిరాకుడ్, సమలేశ్వర్ ఎక్స్‌ప్రెస్‌లను పాక్షికంగా రద్దు చేశామని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (18515) ఈ నెల 10న (గురువారం) విశాఖలో బయలుదేరి కోరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్ (18516) ఈనెల 11న (శుక్రవారం) కోరాపుట్ నుంచి బయలుదేరి విశాఖ వరకూ నడుస్తుంది. కోరాపుట్-కిరండూల్ మధ్య రాకపోకలు రద్దు చేశారు. అలాగే విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501) ఈనెల 10న విశాఖలో బయలుదేరి ... మిగతా 6వ పేజీలో

కూటమి నేత మాస్టర్ ప్లాన్

జనసంచారం లేని రోడ్డును వంద అడుగులకు విస్తరించేలా ప్లాన్

అది ప్రస్తుతం 40 అడుగుల సీసీ రోడ్డు

- వీఎంఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్-2041లో విస్తరణకు ప్రతిపాదన
- రహదారి డెడ్ ఎండ్‌లో రైల్వే ట్రాక్
- భవిష్యత్తులో అటువైపు నివాసాలు పెరిగేందుకు ఏమాత్రం అవకాశమే లేదు
- అయినా ఆగమేఘాల మీద ఆర్‌డీపీ చేసిన జీవీఎంసీ అధికారులు
- 142 స్ట్రక్చర్‌ను తొలగించాల్సి ఉంటుందని టౌన్‌ప్లానింగ్ అధికారుల గుర్తింపు
- వాటికి టీడీఆర్ జారీచేసేందుకు యత్నాలు
- తెరవెనుక చక్రం తిప్పుతున్న నాయకుడు



వీఎంఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్-2041లో వంద అడుగులుకు విస్తరించాలని ప్రతిపాదించిన నాయుడుతోట-పార్లుపాలెం రోడ్డు



రోడ్డు డెడ్ ఎండ్‌లో రైల్వే ట్రాక్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

భవిష్యత్తులో అభివృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించి అక్కడ రహదారులను ఏ మేరకు విస్తరించాలనే దానిపై వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ మాస్టర్‌ప్లాన్‌ను రూపొందిస్తుంటాయి. కానీ అభివృద్ధికి ఏమాత్రం అవకాశం లేదని తెలిసినప్పటికీ ప్రస్తుతం ఉన్న 40 అడుగుల రోడ్డును వంద అడుగులకు విస్తరించాలని వీఎంఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్-2041లో ప్రతిపాదించడం ప్రస్తుతం నగరంలో చర్చనీయాంశంగా మారింది. మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచిందే తడవుగా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆర్‌డీపీ (రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్)కు నోటిఫికేషన్ జారీ చేయడం, ఆగమేఘాల మీద సర్వే చేసి ఎఫెక్ట్ అవుతున్న స్ట్రక్చర్స్‌ను గుర్తించి వాటికి పరిహారంగా టీడీఆర్ జారీచేసేందుకు చర్యలు తీసుకుంటుండడం అనుమానాలకు దారితీస్తోంది. దీని వెనుక కూటమికి చెందిన ఒక నేతకు చెందిన బినామీ ఆస్తులు ఉండడమే కారణమని ప్రచారం జరుగుతోంది.

బీఆర్‌టీఎస్ రోడ్డులో నాయుడుతోట జంక్షన్ నుంచి పొర్లుపాలెం వరకూ 2.6 కిలోమీటర్ల రహదారి ఉంది. ఆ రోడ్డులో ఒక సిమెంట్ కర్మాగారం ఉండేది. ప్రస్తుతం మూతపడింది. ప్రభుత్వ పాఠశాలలు, జీవీఎంసీ వాటర్ వర్క్స్ కార్యాలయంతోపాటు కొన్ని నివాసాలు ఉన్నాయి. రోడ్డు చివరన పొర్లుపాలెం వద్ద రైల్వేట్రాక్ ఉండడంతో అక్కడితో ఎండ్ అయిపోయింది. భవిష్యత్తులో ఆ రోడ్డుపై వాహనాల రాకపోకలు పెరిగేందుకు ఎలాంటి అవకాశం లేదు. ప్రస్తుతం ఆ రోడ్డుకు ఇరువైపులా మరో పది నుంచి 15 అడుగులు వరకు ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలం అవతల రోడ్డుకు ఒక వైపున ప్రభుత్వ స్థలాలే అత్యధికంగా ఉండగా, మరోవైపు గెడ్డవాగు, మరికొన్ని ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. మరికొన్ని ప్రైవేటు స్థలాలు, ఆస్తులు ఉన్నప్పటికీ రోడ్డుకు బాగా దూరంగానే ఉన్నాయి. అయితే వీఎంఆర్‌డీఏ అధికారులు ఎందుకోగానీ ఆ రోడ్డుపై భవిష్యత్తులో వాహనాల రాకపోకలు బాగా పెరిగిపోతాయని, ప్రజలు ఇబ్బంది పడతారని అనిపించింది. అందుకే రోడ్డును వంద అడుగులకు విస్తరించాలని మాస్టర్‌ప్లాన్-2041లో ప్రతిపాదించారు. దీనిని అనుసరించి రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ (ఆర్‌డీపీ) చేయడానికి జీవీఎంసీ పత్రికల్లో ప్రకటనలు ఇచ్చింది. అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత ఆర్‌డీపీ కోసం సర్వే చేశారు. వేపగుంట సర్వే నంబర్ 75,76,77, వెంకటాపురం సర్వేనంబర్ 76, పొర్లుపాలెం సర్వేనంబర్ 76,82లో ... మిగతా 6వ పేజీలో

నిరుపయోగంగా ట్యాబ్‌లు

వైసీపీ హయాంలో రెండేళ్లపాటు ఎనిమిదో తరగతి విద్యార్థులకు పంపిణీ

- టెన్త్ పూర్తయిన తరువాత తిరిగి ఇవ్వడానికి కొందరు నిరాకరణ
- కొన్నింటినే సేకరించిన ఉపాధ్యాయులు
- సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కాక అవి కూడా పనిచేయని వైనం



విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వైసీపీ హయాంలో ఇచ్చిన ట్యాబ్‌లు నిరుపయోగంగా మారాయి. ఇటీవల పదో తరగతి పాసైనవారు చాలామంది ట్యాబ్‌లను తమతో పట్టుకుపోయారు. ఇక ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థుల వద్ద ఉన్నవి పనిచేయడం లేదు. దీంతో రూ.కోట్లు బూడిదలో పోసినట్టయింది.

వైసీపీ హయాంలో ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులకు మాత్రమే 2022-23 నుంచి వరుసగా రెండేళ్లపాటు ట్యాబ్‌లు అందజేశారు. ప్రతి విద్యార్థీ వాటిని ప్రతిరోజూ పాఠశాలకు తీసుకువచ్చి తరగతి గదిలో ఉపాధ్యాయుడు బోధించే పాఠ్యాంశాలను ట్యాబ్ ద్వారా నేర్చుకుని తిరిగి సాయంత్రం ఇంటికి వెళ్లేటప్పుడు తమతో తీసుకువెళ్లే అవకాశం కల్పించారు. ఇందుకు ప్రత్యేకించి వీడియోలు తయారుచేసి అందుబాటులో ఉంచారు. పాఠశాలలో ట్యాబ్‌ల వినియోగానికి ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించారు. ఒక్కో ట్యాబ్‌కు సుమారు రూ.10 వేలు ఖర్చు చేశారు. కాగా గత ఏడాది ట్యాబ్‌ల పంపిణీ నిలిపివేశారు. తొలిసారి ట్యాబ్‌లు తీసుకున్న విద్యార్థులు 2024-25 సంవత్సరంలో పదో తరగతి పరీక్షలు రాసి వెళ్లిపోయారు. వాస్తవంగా ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను పాఠశాల నుంచి వెళ్లిపోయే సమయంలో ప్రధానోపాధ్యాయులకు అందజేయాలి. తల్లిదండ్రులపై కొందరు ప్రధానోపాధ్యాయులు ఒత్తిడి తీసుకువచ్చి ట్యాబ్‌లు తీసుకున్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయుల మధ్య ఘర్షణ జరిగిన సందర్భాలున్నాయి. ప్రభుత్వం తమ కుమారుడికి ఇచ్చిన ట్యాబ్ తిరిగి ఎలా ఇస్తామంటూ తల్లిదండ్రులు వాగ్వాదానికి దిగారు.

కాగా 2023-24లో ఎనిమిదో తరగతి చదివే సమయంలో ట్యాబ్ తీసుకున్న విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన లీప్ యాప్‌లో వీడియోలు రూపొందించి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. అయితే విద్యార్థులకు టీచర్లు తరగతి గదిలో పీఎఫ్ ప్యానల్ బోర్డు ద్వారా పాఠాలు ... మిగతా 6వ పేజీలో

డిప్యూటీ తహశీల్దార్లకు తాత్కాలిక పదోన్నతులు

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 17 మందికి పోస్టులు
- ఆనందపురం తహశీల్దార్‌గా సూరిశెట్టి శ్రీనుబాబు
- గాజువాక తహశీల్దార్‌గా బాతుల శ్రీనివాసరావు
- పెందుర్తికి ఎ.సంతోష్ కిరణ్

విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో డిప్యూటీ తహశీల్దార్లుగా పనిచేస్తున్న 17 మందికి తాత్కాలికంగా తహశీల్దార్లుగా పదోన్నతి కల్పించి, వివిధ మండలాల్లో నియమించారు. విశాఖ జిల్లాలో ఇటీవల జరిగిన తహశీల్దార్ల బదిలీలలో కొందరు అధికారులు ఉన్నత స్థాయిలో పైరవీలు చేసి కీలక ... మిగతా 6వ పేజీలో

ఆనందపురం ఎమ్మార్వోగా శ్రీనుబాబు నియామకం



ఆనందపురం/భీమునిపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం మండల తహశీల్దార్‌గా భీమిలి హెచ్ డిప్యూటీ తహశీల్దార్ సూరిశెట్టి శ్రీనుబాబు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆనందపురం తహశీల్దార్‌గా గత నెల 28న గాజువాక తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీవల్లిని నియమించారు. అయితే తనతో ఒక్క మాట కూడా చెప్పకుండా.. అవినీతి ఆరోపణలు ఉన్న శ్రీవల్లిని నియమించడంపై గంటా శ్రీనివాసరావు అభ్యంతరం వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శ్రీవల్లి నియామకం ఆగిపోయింది. తాజాగా.. మంగళవారం జిల్లా కలెక్టర్ విడుదల చేసిన జాబితాలో ఆనందపురం మండల తహశీల్దార్‌గా సూరిశెట్టి శ్రీను బాబును నియమించారు. దీంతో గంటా పంతం నెరవేరినట్లయిందని స్థానికులు పేర్కొంటున్నారు.

పరిహారాల కోసం 64 దరఖాస్తులు



దరఖాస్తులు అందజేస్తున్న కార్మికులు

తగరపువలస, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు యాజమాన్యం కార్మికులకు చెల్లించవలసిన పరిహారాల కోసం దరఖాస్తులను స్వీకరించడానికి ఏర్పాటు చేసిన కేంద్రంలో మంగళవారం 64 దరఖాస్తులు అందాయి. కార్మిక సంఘాలు మిల్లులో పనిచేసి వివిధ ప్రాంతాలకు వలస పోయిన కార్మికులకు సమాచారం అందించి రప్పిస్తున్నారు. ప్రతిరోజూ ఈ కార్మికులు దరఖాస్తులను అందిస్తున్నారు. మంగళవారం గ్రాట్యుటీ కోసం రెండు, వితంతు పరిహారాల కోసం ఇద్దరు, మిల్లు క్వార్టర్లలో నివాసం ఉండి విద్యుత్తు కనెక్షను కోసం చెల్లించిన సొమ్మును తిరిగి పొందడానికి 11 మంది ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసిన వారు చెల్లింపుల కోసం ఇద్దరు తప్పుడు దరఖాస్తులను సవరించడానికి 47 మంది మొత్తం 64 మంది దరఖాస్తులు చేసినట్టు జూట్ కార్మికుల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు తెలిపారు.



తలంబ్రాలను చూపుతున్న అర్చకులు

ఘనంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, జూలై 8(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలను యథావిధిగా జరిపాక ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్ర నామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించాక పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణాన్ని జరిపారు.

7వ వార్డులో 'సుపరిపాలన'

మధురవాడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని కూటమి నాయకులు పేర్కొన్నారు. 7వ వార్డు పరిధి వాంబే కాలనీ, కళానగర్, తదితర ప్రాంతాల్లో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి నాగోతి సూర్యప్రకాశరావు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ, వెంకట్, ఆనంద్, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీ రహదారి పరిశీలన

కొమ్మాది,జూలై 8(ఆంధ్రజ్యోతి): శివశక్తినగర్ నుంచి మారికవలస ఐటీ రహదారికి వెళ్లే మార్గం అధ్వానంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు కార్పొరేటర్‌కు పలువురు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం టీడీపీ సీనియర్ నాయకుడు మొల్లి లక్ష్మణరావు... జడ్సీ కె.కనకమహాలక్ష్మి, ఈఈ శాంతిరాజు, ఏఈ శ్రీనివాస్‌తో కలిసి ఈ రోడ్డును పరిశీలించారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలంటే కల్వర్టు నిర్మించాలని, అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించి ఉన్నతాధికారులకు పంపాలని అధికారులను కోరారు. అదేవిధంగా బొట్టవానిపాలెం చెరువును ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం గణేశ్‌నగర్ వద్ద మంచి వ్యూ పాయింట్‌తో పాటు ఫౌంటెయిన్‌ను ఏర్పాటు మూడు రోడ్ల జంక్షన్‌ను అభివృద్ధి చేయాలని లక్ష్మణరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

» ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పాల్గొన్న టీడీపీ, జనసేన నేతలు

ఆనందపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారంమండలంలోని శొంఠ్యాం పంచాయతీలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఆర్థిక లోటు ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 80 శాతాన్ని మొదటి ఏడాదిలోనే అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు దక్కుతుందన్నారు. 2019 ఎన్నికల్లో చదువుకునే పిల్లలందరికీ అమ్మ ఒడి ఇస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం 42 లక్షల మంది తల్లులకు మాత్రమే ఆ పథకాన్ని అమలు చేసి మోసం చేసిందని విమర్శించారు. తల్లికి వందనం కింద కూటమి ప్రభుత్వం 62 లక్షల మంది విద్యార్థులకు రూ.15 వేల చొప్పున అందించిందని, తొందర్లో అర్హులైన మరింత మంది విద్యార్థులకూ ఈ పథకాన్ని వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చలేరంటూ వైసీపీ గోబెల్స్ ప్రచారం చేసిందని, ఇచ్చిన హామీలను అమలు చేయడం చూసి జగన్మోహన్‌రెడ్డి మైండ్ బ్లాంక్ అయిందన్నారు. ముందుగా పంచాయతీలోని ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తెచ్చినట్లయితే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలు

మండలంలోని మామిడిలోవ పంచాయతీలో హౌసింగ్ కాలనీ నుంచి బోడమెట్టపాలెంకు రూ.40 లక్షలతో, అప్పికొండపాలెం నుంచి దబ్బంద వరకు రూ.30 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్లకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. శొంఠ్యాం గ్రామంలో రూ.57 లక్షలతో నిర్మించిన జల్ జీవన్ మెషీన్ కొళాయిలను ప్రారంభించారు.

కార్యక్రమంలో జనసేన భీమిలి ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, టీడీపీ నాయకులు ఘట్టమనేని సుభాష్‌చంద్రబోస్, బీఆర్‌బీ నాయుడు, మీసాల సత్యనారాయణ, బలిరెడ్డి మల్లిఖార్జునరావు, శ్రీకాంత్ రాజు, కర్రి శ్రీనివాస్, అప్పల రాము, గంట్రెడ్డి రమేష్, పాండ్రంకి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కణమాం, గిడిజాలలో పొలం పిలుస్తోంది



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఆనందపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గిడిజాల, కణమాం పంచాయతీల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖాధికారి శ్యామల మాట్లాడుతూ జీడి, మామిడి తోటల్లో జూన్, జూలై నెలల్లో కొమ్మ కత్తిరింపులు చేసుకోవాలని సూచించారు. అలాగే పచ్చిరొట్ట ఎరువుల ఆవశ్యకతను రైతులకు వివరించారు. హైబ్రిడ్ కూరగాయలు విత్తనాల సాగుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉంటుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్ సంధ్యారత్నప్రభ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవకు ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే 13వ తేదీ లోగా రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన వన సహాయకురాలు పి.సరోజ, రైతులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేయించుకోవాలి

పద్మనాభం-రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకం జాబితాల్లో పేర్లు లేని రైతులు పేర్లు నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఎంవీ చలం తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడానికి జాబితాను తయారు చేసి రైతు సేవా కేంద్రాల్లో ఉంచామన్నారు. పేర్లు లేకుంటే గ్రామ వ్యవసాయాధికారికి అర్జీ ఇచ్చి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

మెగా పేరెంట్స్ డేను విజయవంతం చేయండి

పద్మనాభం-రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఈ నెల 10న ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో పి.రమణ మంగళవారం పలు జడ్పీ పాఠశాలల ఉపాధ్యాయులతో సమీక్షించారు. అలాగే విద్యార్థులతో మాట్లాడారు. విద్యా శక్తి కార్యక్రమంపై అవగాహన లక్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడుగురు అమ్మవార్లకు మొక్కులు సమర్పణ

భీమునిపట్నం (రూరల్) జూలై 8 (ఆంధ్రజ్యోతి) : భీమిలి రూరల్‌లో జీరుపేటలో మహిళలు బృందంగా ఏడుగురు అమ్మవార్లకు మొక్కులు సమర్పించే కార్యక్రమాన్ని మంగళవారం ఈ గ్రామంలో నిర్వహించారు. ఈ గ్రామస్థులు గ్రామ దేవతగా కొలిచే దుర్గాలమ్మ అమ్మవారి దేవాలయంలో పోలమ్మతల్లి, దుర్గాలమ్మతల్లి, ముత్యాలమ్మ తల్లి, మరిడమ్మతల్లి, కొత్తమ్మతల్లి, జోగాలమ్మ తల్లి, ఎల్లమ్మతల్లి అమ్మవార్లకు మొక్కులు సమర్పించే కార్యక్రమాన్ని గ్రామంలోని మహిళలు సామూహికంగా నిర్వహించారు.

మామిడిపాలెంలో ఆక్రమణల తొలగింపు అడ్డుకున్న స్థానికులు

భీమునిపట్నం (రూరల్) జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు పరిధి మామిడిపాలెంలో కొంత మంది పాల్పడిన ఆక్రమణలను తొలగించే కార్యక్రమాన్ని అధికారులు తాత్కాలికంగా నిలిపి వేశారు. స్థలాలకు విలువ పెరిగి ఈ ప్రాంతంలో ఉన్న గెడ్డను ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలం అయిదు సెంట్ల స్థలాన్ని ఆక్రమించి అందులో స్థానికులు కొంతమంది నివాసాలకు అనుగుణంగా షెడ్డులను నిర్మించుకున్నారు. దీనిపై భీమిలి రెవెన్యూ అధికారులకు మామిడిపాలెం గ్రామసులు ఫిర్యాదు చేశారు. అందిన ఫిర్యాదు మేరకు ప్రభుత్వ స్థలాన్ని అక్రమించి నిర్మాణాలను చేపట్టిన షెడ్డులను తొలగించడానికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, ఇతర సిబ్బంది పోలీసుల సహకారాన్ని కోరారు. ఈ క్రమంలో మంగళవారం వారంతా కలిసి ఎక్స్‌కవేటర్ తీసుకొని వచ్చి ఈ నిర్మాణాలను తొలగించేందుకు వచ్చారు. అయితే గత కొంతకాలంగా ఈ స్థలం తమ ఆదీనంలో ఉందని, ఇది ఆక్రమణ కాదని ఇక్కడున్నవారు అధికారులతో వాదించారు. వాటిని తొలగించడాన్ని అడ్డుకున్నారు. తొలగించడానికి వీలు లేదని పోలీసులు, రెవెన్యూ అధికారులలో వాదించారు. ఆక్రమణల దారులుగు చెబుతున్న వారికి మద్దతుగా కొంతమంది గ్రావస్తులు అధికారులకు ఎదురు తిరిగారు. ఎవరో ఫిర్యాదు చేయగానే వాస్తవాలు గుర్తించకుండా ఇలా తొలగింపు చేపట్టడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు.

ఈ నేపథ్యంలో రెండు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. ఒక దశలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో మొత్తం రికార్డులను తీసుకుని సర్వేయర్‌తో వచ్చి కొలతలు వేసిన తర్వాత వీటి తొలగింపు చేపడతామని రెవెన్యూ అధికారులు ప్రకటించారు. తొలగింపు కార్యక్రమాన్ని విరమించి వెనుదిరిగారు.

బటర్‌ఫ్లై పార్కు వివరాలను అందించండి

అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం



పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్, తదితరులు

కొమ్మాది, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-2 పరిధి ఆరో వార్డులో వివాదాస్పదంగా మారిన ఎంఎస్ఆర్ లేఅవుట్‌లోని బటర్‌ఫ్లై పార్కు భూబదిలాయింపు ప్రాంతాన్ని మంగళవారం కమిషనర్ కేతన్ గార్గ్ పరిశీలించారు. పార్కుకు సంబంధించిన పూర్తి వివరాలను తనకు అందించాలని అధికారులను ఆదేశించారు. పార్కులోని ఓపెన్ ఆడిటోరియం, జిమ్, చిల్డ్రన్ ప్లే ఎక్విప్‌మెంట్, వాకింగ్ ట్రాక్, లైటింగ్ బౌండరీవాల్, హార్టీకల్చర్ పనులను పరిశీలించారు. పార్కులోని కొంత స్థలాన్ని ప్రైవేటు స్థల యజమానులకు, వారి స్థలాన్ని పార్కుకు అధికారికంగా మార్పు చేసే విషయానికి సంబంధించిన పత్రాలు, కొలతలు, సర్వే రికార్డులను కేతన్ గార్గ్ తిలకించారు.

ఈ సందర్భంగా ఆయన ప్రైవేటు స్థల యజమానులతో మాట్లాడి.. వారికి ఆ స్థలం ఎలా సంక్రమించింది, స్థల మార్పిడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పలువురు స్థానికులు కమిషనర్‌ను కలిసి పార్కు బటర్‌ఫ్లై ఆకారంలో ఉన్నందున దీనికి బటర్‌ఫ్లై పార్కుగా నామకరణం చేశారని, ఇప్పుడు స్థల మార్పిడి చేస్తే ఆ ఆకారం పోతుందని వివరించారు. అందుకు ఆయన అధికారులను డిజైన్ చూపాలని అధికారులను ఆదేశించడంతో వారు చూపించారు. ఒక యాంగిల్‌లో బటర్‌ఫ్లైలా కనిపిస్తుందని, అదికూడా పూర్తి ఆకారం లేదని కమిషనర్ పేర్కొన్నారు. ఆకారాన్ని బట్టి కాకుండా ఇక్కడ బటర్‌ఫ్లైలను పెంచి వాటిని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో పార్కుకు ఆ పేరు పెట్టినట్టు అధికారులు అంటున్నారన్నారు. పార్కుకు సంబంధించి పూర్తి మ్యాపును, వివరాలను నివేదిక రూపంలో తనకు సమర్పించాలని చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావును ఆదేశించారు. వీఎంఆర్డీఏ చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప కమిషనర్‌తో మాట్లాడుతూ పార్కు స్థలం బదలాయింపులో కమర్షియల్ జాగా కోల్పోతున్నదున ఆ కోణంలో కూడా ఆలోచించాలన్నారు. ఇటీవల బదిలీలపై వచ్చిన సచివాలయ ఉద్యోగులు వెంటనే బాధ్యతలు చేపట్టేలా చూడాలని జడ్సీ కనకమహాలక్ష్మికి కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో గ్రేటర్ అధికారులు ధనుంజయరెడ్డి, హరిదాసు, తిరుపతిరావు, పీఎస్‌నాయుడు, శ్రీరామ్, చినగదిలి తహశీల్దార్ పాల్‌కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళి



సాగర్‌నగర్‌లో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

భీమునిపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. 3వ వార్డులో వైసీపీ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నరసింగరావు ఆధ్వర్యంలో పాత బస్టాండ్, చిన్నబజార్ జంక్షన్, తోటవీధిలో ఉన్న వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి పార్టీ శ్రేణులు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు షైలపల్లి షణ్ముఖరావు, పి.స్వర్ణలత, కె.ఎల్లాజీ, ఎం.లక్ష్మణరావు, వి.కొండబాబు, పి.ఎర్రయ్యరెడ్డి, జి.మధునాయుడు, కె.రామసూరప్పుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం: వేములవలస జంక్షన్‌లో వైసీపీ మండల అధ్యక్షుడు బంక సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు, తదితరులు వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. నాయకులు మజ్జి వెంకటరావు, పి.శ్రీను, రాంబాబు, కె.అప్పల స్వామినాయుడు, రాంబాబు, బంక శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస: జీవీఎంసీ 2వ వార్డు పరిధి జీరుపేటలో వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి వైసీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాబాయి రెడ్డి, గణేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం: వైసీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్ చిత్ర పటానికి అభిమానులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. సీఎంగా వైఎస్.. బడుగు, బలహీన వర్గాలకు చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో అడవివరం సహకార పరపతి సంఘ పాలక మండలి అధ్యక్షులు కర్రి అప్పలస్వామి, నాయకులు పీతల అప్పలరాజు, లంక సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్: దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని బీచ్‌రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద వైసీపీ 8వ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి ఎండాడ మాజీ సర్పంచ్ చెన్నాదాసు, గుడ్ల పోలిరెడ్డి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎన్.రాంబాబు, అప్పలరాజు, బి.చిన్న, బుజ్జి, చంటి, నరసింగరావు, పవన్, తదితరులు పాల్గొన్నారు.



98వ వార్డులో వైఎస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

కొమ్మాది: నిరుపేదల సంక్షేమానికి విశేష కృషి చేసిన మహనీయుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైసీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు అన్నారు. వైసీపీ నాయకుడు పిళ్లా సూరిబాబు ఆధ్వర్యంలో చంద్రంపాలెం బాపూజీ కళామందిరం వద్ద వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులఅర్పించారు. కార్యక్రమంలో నాయకులు పిళ్లా పాపారావు, పి.పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

'గీతం'లో సైన్స్ విద్యార్థుల పరిశోధనలకు అవకాశం

» గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ వేదవతి

సాగర్‌నగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా నిర్వహిస్తున్న నాలుగేళ్ల బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశం పొందే విద్యార్థులు ఎటువంటి అదనపు రుసుము చెల్లించకుండా మేనేజ్‌మెంట్ సామాజిక శాస్త్రాలకు సంబంధించిన సబ్జెక్టులను మైనర్ సబ్జెక్టులుగా ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్టు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి తెలిపారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బయో కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ విత్ కాగ్నిటివ్ సిస్టమ్స్, మైక్రో బయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌ల్లో నాలుగేళ్ల బీఎస్సీ (ఆనర్స్) కోర్సులు, మూడేళ్ల బీసీఏ కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. అలాగే అప్లైడ్ మేథ్స్, బయో కెమిస్ట్రీ అండ్ మాలిక్యూలర్ బయాలజీ, డేటా సైన్స్, బయో కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రో బయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌ల్లో రెండేళ్ల ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వీటితో పాటు మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. నాలుగేళ్ల బీఎస్సీ కోర్సులో చేరిన విద్యార్థులు రెండు, మూడేళ్లలో పరిశోధన ప్రాజెక్టులను చేపట్టేలా ఇంటర్న్‌షిప్‌లతో ప్రోత్సహిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. వివరాలకు వివరాల కోసం గీతం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సైన్స్ అడ్మిషన్ల కో-ఆర్డినేటర్ డాక్టర్ మాధవ ప్రసాద్ పేర్కొన్నారు. సమావేశంలో పలు విభాగాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

'అన్నదాత' గడువు పెంపు

పద్మనాభం, జూలై 8(ఆంధ్రజ్యోతి): రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 13 వరకు పొడిగించినట్టు మండల వ్యవసాయాధికారి ఎంవీఎస్ చలం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకుడిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు 6417మంది ఈపథకం కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు.

నేడు అయినాడలో సుపరిపాలనలో తొలి అడుగు

పద్మనాభం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఇప్పటి వరకూ చేపట్టిన కార్యక్రమాలపై నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఈ నెల 9న ఉదయం 10 గంటలకు అయినాడ గ్రామం నుంచి ప్రారంభమవుతుందని ఎంపీడీవో ఎం.విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

కేకే లైన్‌లో రైళ్ల పాక్షిక రద్దు

... 5వ పేజీ తరువాయి

కోరాపుట్ వరకూ, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ పాసింజర్ (58502) కోరాపుట్‌లో బయలుదేరి విశాఖ చేరుతుంది. కోరాపుట్, కిరండూల్ మధ్య రాకపోకలు రద్దు చేశారు. హౌరా-జగదల్‌పూర్ సమలేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (18005) ఈనెల 8 నుంచి 10 వరకు హౌరాలో బయలుదేరి కోరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో (18006) ఈనెల 10 నుంచి 12 వరకు కోరాపుట్‌లో బయలుదేరి హౌరా చేరుతుంది. ఈ సర్వీసులకు కోరాపుట్-జగదల్‌పూర్ మధ్య రాకపోకలు రద్దు చేశారు. ఇక భువనేశ్వర్-జగదల్‌పూర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (18447) ఈనెల 10 వరకు భువనేశ్వర్‌లో బయలుదేరి కోరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్-భువనేశ్వర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (18448) కోరాపుట్ నుంచి బయలుదేరి భువనేశ్వర్ నేరుతుంది.

కూటమి నేత మాస్టర్ ప్లాన్

... 5వ పేజీ తరువాయి

రోడ్డుకు ఒక వైపు 93 స్ట్రక్చర్లు, మరోవైపు 49 స్ట్రక్చర్లు మొత్తంగా 142 స్ట్రక్చర్లు ఎఫెక్ట్ అవుతున్నట్టు గుర్తించారు. ఆయా స్ట్రక్చర్లు 50,012 చదరపు మీటర్ల వైశాల్యంలో ఉన్నట్టు ఆర్‌డీపీలో పేర్కొన్నారు.

టీడీఆర్‌లు కొట్టేసేందుకే ఎత్తుగడ

అవసరం లేని రోడ్డును విస్తరించాలంటూ ప్రతిపాదించడం వెనుక టీడీఆర్‌లు కొట్టేయాలనే ఎత్తుగడ ఉందని కూటమి కార్పొరేటర్లు కొందరు ఆరోపిస్తున్నారు. ఆ రహదారికి ఆనుకుని ఇరువైపులా ప్రభుత్వ స్థలాలతోపాటు కొన్ని ప్రైవేటు స్థలాలను బినామీ పేర్లతో కలిగివున్న కూటమికి చెందిన నేతే వెనకుండి అధికారులతో కథ నడిపిస్తున్నారని స్వపక్షానికి చెందిన కార్పొరేటర్లే ఆరోపిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడున్న 40 అడుగుల సీసీ రోడ్డులోనే పెద్దగా జనసంచారం ఉండదని, చివరన రైల్వే ట్రాక్ ఉండడంతో భవిష్యత్తులో రద్దీ పెరిగే అవకాశం లేదని స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ అధికార బలంతో జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులపై ఒత్తిడి తెచ్చి అవసరం లేకపోయినా మాస్టర్‌ప్లాన్‌లో రోడ్డు విస్తరణ పెట్టించి, ఆగమేఘాల మీద ఆర్‌డీపీ చేశారని కూటమి కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. ఆర్‌డీపీలో సేకరించాలనుకున్న భూముల్లో చాలావరకు ఆక్రమణలే ఉన్నాయని, వాటికి కూడా పరిహారంగా టీడీఆర్ ఇచ్చేలా అధికారులు ఫైల్ సిద్ధం చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ విషయం టౌన్‌ప్లానింగ్ అధికారుల వద్ద ప్రస్తావించగా ఆ రోడ్డులో కొంతభాగంపై కోర్టులో కేసు నడుస్తోందని, ఆర్‌డీపీ గురించి ఫైల్ పరిశీలించిన తర్వాతే మాట్లాడగలమని తప్పించుకుంటుండడం విశేషం.

నిరుపయోగంగా ట్యాబ్‌లు

... 5వ పేజీ తరువాయి

బోధిస్తున్నారు. ట్యాబ్‌ల విషయం మరిచిపోయారు. అంతేకాక ట్యాబ్‌లలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయకపోవడంతో చాలావరకు పనిచేయడం లేదు. కొన్ని అసలు ఆన్ కావడం లేదు. ఎక్కడైనా టీచర్లు చొరవ తీసుకుని ట్యాబ్‌ల ద్వారా బోధిద్దామని యత్నించినా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కాక పనిచేయడం లేదు. ట్యాబ్‌లు సరఫరా చేసిన కంపెనీ టెక్నీషియన్లు పాఠశాలలకు వచ్చి వాటిని అప్‌డేట్ చేయాల్సి ఉంది. విద్యా శాఖలో ట్యాబ్‌లు, ఇతరత్రా సాంకేతిక అంశాలు పర్యవేక్షించే విభాగం కూడా ఈ అంశం పట్టించుకోవడం లేదు. మొత్తంగా కోట్ల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ట్యాబ్‌ల కథ అలా ముగిసింది.

సింహగిరి ప్రదక్షిణ భూప్రదక్షిణతో సమానం

... 5వ పేజీ తరువాయి

సంహరించే సమయంలో విష్ణువు 32 రూపాలు ధరించాడని, అదేవిధంగా నృసింహస్వామి మూలమంత్రంలో 32 బీజాక్షరాలు ఉన్నాయని అందుకే 32 కిలోమీటర్ల వ్యాసార్థం కలిగిన సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణ చేసినంత ఫలాన్ని ఇస్తుందని అంటారు. గురుపౌర్ణమిగా నాడే సింహగిరి ప్రదక్షిణ ఎందుకు చేయాలంటే...వేదవ్యాసుడు వేదాలను విభజించి మానవాళికి గురువుగా పూజించబడుతున్నాడు. భగవానుడి తత్వాన్ని విశ్వానికి తెలిపిన వ్యాసుడు జయంతికి ప్రత్యేకత ఉంది. గురువు అంటే పెద్దది, విశ్వం అని అర్థాలు ఉన్నాయి. ఏటా వైశాఖమాస శుక్లపక్ష తదియ, పౌర్ణమి, జేష్ఠ, ఆషాఢ పౌర్ణమిలలో నాలుగు విడతలుగా చందనాన్నిపైపూతగా సమర్పించడంతో సింహాద్రినాథుడు గురు(పెద్ద)రూపం సంతరించుకుంటాడు. అందుకే వ్యాసపూర్ణిమనాడు గిరిప్రదక్షిణ చేస్తారనిసింహాద్రప్పన్న ఆలయస్థానాచార్యులు తెలిపారు.

డిప్యూటీ తహశీల్దార్లకు తాత్కాలిక పదోన్నతులు

... 5వ పేజీ తరువాయి

స్థానాలు దక్కించుకున్నారు. అయితే అక్కడ వారిని చేర్చుకోవడానికి స్థానిక ప్రజాప్రతినిధులు అంగీకరించలేదు. మాట మాత్రం చెప్పకుండా వారిని ఎలా నియమిస్తారంటూ అడ్డం పడ్డారు. దాంతో కొందరు ఆయా మండలాల్లో బాధ్యతలు చేపట్టలేకపోయారు. ఇప్పుడు ఆ స్థానాలను కూడా డిప్యూటీ తహశీల్దార్లతో భర్తీచేశారు. విశాఖ జిల్లాలో ఆనందపురం తహశీల్దార్‌గా సూరిశెట్టి శ్రీనుబాబును, గాజువాక తహశీల్దార్‌గా బాతుల శ్రీనివాసరావును, పెందుర్తికి ఎ.సంతోష్ కిరణ్‌ను నియమించారు. అదేవిధంగా అనకాపల్లికి పి.సత్యనారాయణను నియమించారు. మిగిలిన వారందరినీ అల్లూరి సీతారామరాజు జిల్లాలో నియమించారు.

ఇక్కడ పనిచేయడం ఇష్టం లేకుంటే చెప్పండి

... 5వ పేజీ తరువాయి

ఎందుకు ప్రతిపాదించారంటూ ప్రశ్నించారు. గిరి ప్రదక్షిణ మార్గంలో పూర్తి స్థాయిలో విద్యుత్ వెలుగులు ఉండేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో దేవాలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈలు రాంబాబు, రామకృష్ణ, సీహెచ్ వెంకట రమణ, ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం, 98వ వార్డు తెదేపా అధ్యక్షులు పంచదార్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరికి ఉత్సవ శోభ

... 5వ పేజీ తరువాయి

ఏర్పాట్లు తనిఖీ చేశారు. గిరి ప్రదక్షిణ సందర్భంగా బుధ, గురువారాల్లో దేవస్థానంలో నిత్యకల్యాణం, సుప్రభాత సేవ, ఆరాధనసేవ, అష్టోత్తర, సహస్రనామార్చన వంటి ఆర్జిత సేవలు రద్దు చేశారు. అదేవిధంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండు రోజులు నీలాద్రి గుమ్మం వద్ద నుంచి అప్పన్న దర్శనాలు కల్పించనున్నారు.

పదో తేదీన...

పదో తేదీ తెల్లవారుజామున ఒంటి గంటకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలుపుతారు. 2.30 గంటల నుంచి 4 గంటల వరకూ మూడు మణుగుల చందనం సమర్పిస్తారు. 4 నుంచి ఐదు గంటల వరకు ప్రభాత ఆరాధన, బాల భోగం, రాజభోగాల నివేదనలు కావిస్తారు. ఉదయం 5.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకూ నిరంతరాయంగా భక్తులకు స్వామివారి దర్శనాలు కల్పిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 4.00 గంటల వరకూ పవళింపుసేవ, ఢిల్లీ విజయం ఉత్సవం జరుగుతాయి. ఈ కారణంగా మధ్యాహ్నం 3.30 నుంచి 5.30 గంటల వరకు భక్తులకు దర్శనాలు లభించవు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు భక్తులకు స్వామివారి దర్శనాలు ఉంటాయి. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకకూ రాత్రి ఆరాధన (భక్తులకు దర్శనాలు లభించవు), 9 గంటలకు పవళింపుసేవ ఉంటాయి. అనంతరం కవాట బంధనం చేస్తారు.

కాగా, పదో తేదీ ఉదయం మూడు గంటల నుంచి భక్తులను ఆలయ ప్రదక్షిణకు అనుమతిస్తారు. భక్తుల సౌకర్యార్థం కార్పెట్లు పరచి, ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఆలయ ప్రదక్షిణ చేసే భక్తుల వల్ల సాధారణ భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఉత్తర, దక్షిణ రాజగోపురాల వద్ద రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటుచేశారు.

వైభవంగా అమ్మవార్ల ఉత్సవాలు



వడ్డన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : దీన దయాళ్‌పురంలో కొలువైయున్న విజయదుర్గాదేవి వార్షికోత్సవాలు, గ్రామ దేవత పైడిమాంబ అమ్మజాతర మహోత్సవాలను పురష్కరించుకొని మంగళవారం గౌతమీ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి భక్తులకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ 12వ అధ్యక్ష, కార్యదర్శులు, గ్రామ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాస రచన, వక్తృత్వ పోటీలు

వెంకోజీపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఏయూ శతాబ్ధి ఉత్సవాల్లో భాగంగా జనాభా పరిశోధన కేంద్రం (పాపులేషన్ రీసెర్చ్ సెంటర్), స్టాటిస్టిక్స్ విభాగం, ఏయూ సంయుక్తంగా 'ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూ అనుబంధ కళాశాలలు, అలాగే వర్సిటీలో వివిధ కళాశాలలు, విభాగాలకు చెందిన డిగ్రీ, పీజీ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ కళాశాలలకు చెందిన సుమారు 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ హానరరీ డైరెక్టర్, స్టాటిస్టిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి.మునిస్వామి, రీసెర్చ్ సెంటర్ స్టాప్ డాక్టర్ వై.రమణ, డాక్టర్ సీహెచ్ పాదాలు, డాక్టర్ టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

ఎంవీపీ కాలనీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : వెంకోజీపాలేనికి చెందిన యువకుడు అదృశ్యమైనట్టు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపిన వివరాలి ఉన్నాయి. వెంకోజీపాలెంలో ఉంటున్న పద్మశ్యామల తమ కుమారుడు సన్నీడియోల్ (23) ఈ నెల 5న ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి, ఇప్పటి వరకూ తిరిగిరాలేదని, ఫోన్ స్విచాఫ్ అయి ఉందని పేర్కొంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతడి స్నేహితుడు కూడా ఫోన్‌కు స్పందించడం లేదని, ఒక యువతితో పరిచయం ఉందని, ఆమెకు పలు బహుమతులు ఇవ్వడం కోసం తన కుమారుడు కొన్ని అప్పులు చేసినట్టు పేర్కొంది. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అప్పుఘర్ కూడలి వద్ద భక్తులకోసం ఏర్పాటు చేసిన పగోడాలు



దుస్తులు మార్చుకోవడానికి ఏర్పాటు చేసిన గుడారాలు



అప్పుఘర్ తీరంలో స్నానాలు, మరుగుదొడ్లకు ఏర్పాట్లు



సముద్రంలో ఈత నిషేధంపై హెచ్చరిక బోర్డు

గిరి ప్రదక్షిణ కోసం సకల ఏర్పాట్లు

- సముద్ర తీరాల్లో భక్తుల అవసరాలకు అనుగుణంగా వసతులు
- పలు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు
- ఏర్పాట్లను పరిశీలించిన జేసీ మయూర్ అశోక్, ఇతర అధికారులు



లుంబినీ పార్కు వద్ద ఏర్పాట్లు పరిశీలించి సూచనలిస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ఎంవీపీ కాలనీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గిరి ప్రదక్షిణకు లక్షలాదిగా తరలివచ్చే భక్తుల కోసం అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదనే ఉద్దేశంతో సన్నాహాలు చేస్తున్నారు. అధిక శాతం భక్తులు తెన్నేటి పార్కు మీదుగా అప్పుఘర్ లుంబినీ పార్కు వద్ద సముద్రంలో స్నానం చేసి, ఇక్కడ కాసేపు సేద తీరి, తిరిగి నడక సాగిస్తుంటారు. అందుకే ఇక్కడ అవసరాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేశారు. కూడలి వద్ద భక్తులు సేద తీరేందుకు పగోడాలను ఏర్పాటు చేశారు. అలాగే ఎవరికీ అనారోగ్యం ఎదురైనా, ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తక్షణ వైద్యం కోసం శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. మహిళలు స్నానం చేసిన తర్వాత దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేకంగా గుడారాలను ఏర్పాటు చేశారు. సముద్ర తీరంలో స్నానానికి దిగడం వల్ల ప్రమాదం ఎదురయ్యే అవకాశం ఉండడంతో, ఎవరినీ లోపలకు అనుమతించకుండా, తీరంలోనే స్నానం ఆచరించేందుకు వీలుగా డ్రమ్ములతో నీరు ఏర్పాటు చేశారు. సముద్రంలోకి వెళ్లకూడదనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. పూర్తి స్థాయిలో మంచి నీటిని అందుబాటులో ఉంచారు. సముద్ర తీరంలోనే పోలీసు పికెట్ కూడా ఉంచారు. ఇక హనుమంతువాక నుంచి కొందరు భక్తులు సముద్ర స్నానానికి వెళ్లకుండా జాతీయ రహదారిపై వెంకోజీపాలెం మీదుగా వెళుతుంటారు. వారి కోసం జాతీయ రహదారి పక్కన ఏర్పా టు చేసే పండ్ల దుకాణాలు బుధవారం తెరవకూడదని ఆదేశాలు జారీ చేశారు. సుమారు అయిదడుగులరహదారిని పాదచారుల కోసం వదిలేశారు.

ఏర్పాట్లు పరిశీలించిన జేసీ

గిరిప్రదిక్షణలో కీలకమైన అప్పుఘర్ వద్ద ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఏర్పాట్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఆర్డీవో, తహసీల్దార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఆర్థిక సహాయ పత్రాల అందజేత



సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా

ఎంవీపీ కాలనీ/ భీమునిపట్నం జూలై 8 (ఆంధ్రజ్యోతి) : భీమిలి నియోజకవర్గంలో నలుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అందజేశారు. మంగళవారం ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో రూ.7.5 లక్షల మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. వివిధ ఆరోగ్య సమస్యలతో వీరు సీఎంఆర్‌ఎఫ్ నుంచి ఆర్థిక సహాయాన్ని కోరగా, ఎమ్మెల్యే గంటా సిఫారసులతో జీవీఎంసీ 2వ వార్డు ఆదర్శనగర్‌కు చెందిన దుక్క లీలాకుమారికి రూ.2,23,187లు, 8వ వార్డు రుషికొండకు చెందిన గద్దేపల్లి సాకేత్‌కు రూ. 2,14,931లు, ఆనందపురం మండలం లొడగలవానిపాలేనికి చెందిన కంచుబోయిన ఎల్లమ్మకు రూ.1,62,000లు, ముకుందపురానికి చెందిన కోడితల రాముఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.

12వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు



స్థానికులతో మాట్లాడి యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న ఎంపీ శ్రీభరత్

ఆరిలోవ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు ఆధ్వర్యంలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు పాల్గొన్నారు. గణబాబు నగర్, పూర్ణతేజ నగర్, బీటీఆర్ నగర్‌లో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తామని చెప్పారు. స్థానికులతో మాట్లాడి ఆయా ప్రాంతాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. విశాఖకు ఐటీతో పాటు అనేక పరిశ్రమలు వస్తున్నాయని, అమరావతి రాజధాని పనులు, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ ఆరిలోవ కొండవాలు ప్రాంతంలో సుమారు రూ.ఆరు కోట్లతో రిటర్నింగ్ వాల్, రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ ప్రాంతంలో రూ. 14 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం, చంద్రన్న పట్టాల రిజిస్ట్రేషన్, చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, పార్లమెంటరీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి పోలారావు, పార్లమెంటరీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు, బుడుమూరు గోవింద్, టీడీపీ 10వ వార్డు మద్దిల రాజశేఖర్ 9, 10, 11,12,13 వార్డుల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల భాగస్వామ్యం అవసరం

వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు, పాల్గొన్న ఆచార్యులు

మద్దిలపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు పాటుపడాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలుష్యంపై అవగాహన కల్పించేందుకు ఏపీ ఇండక్షన్ ప్రోగ్రాం తీసుకొచ్చారన్నారు. ఈ ప్రోగ్రాం ద్వారా కాలుష్యంపై ఇంటింటి సర్వేలు, వినియోగించిన ప్లాస్టిక్‌ను నిరోధించే అవగాహన, వృక్షార్పణ, రక్తదాన శిబిరాలు వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. యువతలో వాతవరణ అవగాహన, సామాజిక బాధ్యతను పెంపొందించడాన్ని లక్ష్యంగా ఏపీ ఇన్‌డక్షన్ ప్రోగ్రాం ఉంటుందన్నారు. అనంతరం ప్రోగ్రాంలో పాల్గొనే విద్యార్థులు రెడ్‌క్రాస్ మొబైల్ యాప్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ రీజనల్ కో-ఆర్డినేటర్, పి.ఉమామహేశ్వరరావు, ప్రోగ్రాం అధికారులు బి.లక్ష్మి, జి.విజయప్రతాప్, బి.నాగేశ్వరరావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్ :** శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 32, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 38, పచ్చిమిర్చి 64, కాకరకాయలు 36, బీరకాయలు 44, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 40, దొండకాయలు 44, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 66, అల్లం (పాతది)50, బరబాటి 38, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 45, బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వె ల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 78, గోరు చిక్కుడు 44, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

బ్యాగ్	
రైతు ధర	78
లైవ్ ధర	98
విత్ స్కిన్	166
స్కిన్‌లెస్	176

డ్రగ్స్ కేసులో ఇద్దరిని తప్పించారు : మాజీ మంత్రి అమర్‌నాథ్

మద్దిలపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఏయూ మైదానంలో పట్టుబడిన డ్రగ్స్ కేసునిందితుల్లో ఇద్దరిని తప్పించారని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో మంగళవారంఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కేసులో నిందితుడు థామస్ 25 గ్రాముల కొకైన్ అక్షయ్‌కుమార్ వర్మకు అందిస్తుండగా పోలీసులు పట్టుకున్నట్టు వెల్లడించారన్నారు. వారి ఫోన్ కాల్స్ డేటా ప్రకారం కోనేరు రఘు, గౌతమ్‌జైన్, వైద్యుడు కృష్ణచైతన్యలను అదుపులోకి తీసుకుని వైద్యుడిని మాత్రమే అరెస్టు చేశారన్నారు. నగరంలోని సీనియర్ ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఒత్తిడి చేయడంతో గౌతమ్, రఘులను తప్పించారని ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన యువ ఎంపీకి అక్షయ్ కుమార్ అత్యంత సన్నిహితుడు కావడమే ఇందుకు కారణమని అమర్‌నాథ్ ఆరోపించారు. విశాఖకుకంటైనర్ వస్తే డ్రగ్స్ వచ్చాయని నాటి వైసీపీ ప్రభుత్వంపై బురదజల్లారన్నారు. ఇప్పుడు విశాఖను గంజాయి, కొకైన్ రాజధానిగా మార్చేస్తూ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారన్నారు. పోలీసులు, ప్రభుత్వం డ్రగ్స్ వ్యవహారం దాచిపెట్టినా ప్రతిపక్షంగా తమకు తెలిసిన విషయాలన్నీ ప్రజలకు తెలియజేస్తామన్నారు. అలాగే బీచ్‌రోడ్డులో కొత్త నిర్మిస్తున్న హోటల్, నోవాటెల్‌కు బ్రిడ్జి నిర్మాణాన్ని అడ్డుకుంటామన్నారు. వరుణ్ బే సాండ్ హోటల్ నిర్మాణంతో బీచ్ అందాలను పాడుచేయాలనుకుంటే కోర్టుకు వెళ్తామన్నారు.

ఏదీ మార్గం?

- రోడ్లపైనే భవన నిర్మాణ పనులు
- రాకపోకలకు వీలు లేని పరిస్థితి
- పట్టించుకునే నాథుడే కరువు
- స్థానికులకు తప్పని ఇబ్బందులు



మద్దిలపాలెం పెద్ద నుయ్యి రోడ్డులో అడ్డంగా పెట్టిన కాంక్రీట్ మిక్సర్

మద్దిలపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెంలో రోడ్డులు ఆక్రమణలకు గురవుతున్నాయి. భవన నిర్మాణ సామగ్రిలతో కొంతమంది ఆక్రమణలకు పాల్పడితే, రోడ్డు నిర్మాణ పనులు చేపడుతూ కొందరు కాంట్రాక్టర్లు రోడ్డులను మూసివేస్తున్నారు. పరిస్థితి ఎంత దారుణంగా ఉంటోందంటే... చీమ దూరడానికి కూడా అవకాశం లేనంతగా రోడ్లను ఆక్రమించేస్తూ రాకపోకలకు అవకాశం లేకుండా చేస్తున్నారు. రాజేశ్వరి ఆలయం రోడ్డులో భవన నిర్మాణ సామగ్రి ఇసుక, ఇటుకలు నిల్వ చేస్తున్నారు. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు వెళ్లేందుకు దారి లేక నిలిచిపోతున్నాయి. నిత్యం తిరిగే ఆటోలు, ద్విచక్రవాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాయి.

అలాగే ఇదే రోడ్డులో ఒక వైపు మొత్తం ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేయడం వలన ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ట్రిబుల్ ఎస్ బార్ నుంచి చైతన్యనగర్‌కు వెళ్లే రహదారిలో ఇదే పరిస్థితి. ఎక్కడికక్కడ భవన నిర్మాణ సామగ్రి, వాహనాల పార్కింగ్‌లతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెద్ద నుయ్యి రోడ్డుకు అడ్డంగా కాంక్రీట్ మిక్సర్..

మద్దిలపాలం పెద్ద నుయ్యి రోడ్డుకు అడ్డంగా కాంక్రీట్ మిక్సర్‌ను పెట్టారు. దీంతో ఆ రహదారిలో ప్రయాణాలు చేయడానికి వీలులేకుండా పోయింది. చైతన్యనగర్, మద్దిలపాలెం ప్రాంతాల వారు సీతమ్మధార రైతుబజార్, జాతీయ రహదారికి వెళ్లడానికి ఇదే మార్గం. ఈ మార్గంలో దారికి అడ్డంగా కాంక్రీట్ మిక్సర్ పెట్టడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల ఇక్కడ సిమెంట్ రోడ్డు నిర్మాణం చేశారు. నూతనంగా వేసిన రోడ్డులో వాహనాలు వెళ్లకుండా మిక్సర్ పెట్టారు.

రోడ్డు ఆరిపోయినా.. రోజుల తరబడి మిక్సర్ తీయకపోవడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదే రోడ్డులో నిర్మాణ వ్యర్థాలు రోడ్డుపైనే వేశారు. వాటిని తొలగించకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. రాకపోకలకు వీలు లేకుండా అధ్వానంగా మారుతున్న మద్దిలపాలెం రోడ్ల దుస్థితిపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.



రాజేశ్వరిఆలయం రోడ్డులో భవన నిర్మాణ సామగ్రి వేయడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్న వాహనచోదకులు



మద్దిలపాలెం సచివాలయం రోడ్డులో వ్యర్థాలు

ప్రసాదాల పంపిణీకి భారీగా సన్నాహాలు

- శ్రీవంశీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు



ఒకటో సెక్టరు వద్ద ఏర్పాటు చేసిన అప్పన్న ఆలయ నమూనా

ఎంవీపీ కాలనీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఆ కాలనీ ఒకటో సెక్టరులో శ్రీ వంశీకృష్ణ సేవా సమితి, వారి మిత్ర బృందం కలసి ఇక్కడ అప్పన్న ఆలయం తలపించే విధంగా సెట్టు వేశారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి గురువారం తెల్లవారు జాము మూడు గంటల వరకూ నిరంతరాయంగా ప్రసాదాల పంపిణీ కొనసాగించడమే కాకుండా సాయంత్రం నుంచి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సమితి ప్రతినిధులు తెలిపారు. పాతికేళ్లుగా గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు వీరు ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. ఆ ప్రసాదాలు వినూత్నంగా ఉండడమే ఇక్కడి విశేషం. ఇక ఇక్కడ ప్రసాదాల తీరు చూస్తే ఓహో అనుకోకుండా ఉండలేరు. ప్రతి గంటకూ ప్రసాదాలు మారుతుంటాయి. పులిహోర, చక్కెర పొంగలి, బూందీ, మజ్జిగ, అరటిపండ్లు, శెనగపప్పు గారెలు అల్లం టీ, సమోసా, మిరపకాయ బజ్జీ, అరటికాయ బజ్జీ, అన్నవరం ప్రసాదం, జిలేబీ, జాంగ్రీ, బొబ్బట్లు, బాదంపాలు, ఉల్లిపాయ బజ్జీ, లస్సీ, మిరియాల పాలు, మినపగారె, బంగాళ దుంప బజ్జీ, టాటా గ్లూకోజ్ పానీయం, వాటర్ బాటిల్, ఫ్రూటీ డ్రింక్, కేక్ బ్రెడ్, బన్ కేక్, పలు రకాల బిస్కెట్స్, కూల్ డ్రింక్ వంటివి ఇక్కడ పంపిణీ చేయనున్నారు.

నేడైనా శంఖుచక్రనామాలు వెలుగులీనేనా?



టీటీడీ కూడలి వద్ద ఏర్పాటు చేసిన శంఖుచక్రనామాలు

ఎంవీపీ కాలనీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : టీటీడి కూడలి వద్ద శంఖుచక్రనామాలు ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా వాటిని వెలిగించడానికి అధికారులకు ముహూర్తం కుదరడం లేదు. గిరి ప్రదక్షిణ సందర్భంగా బుధవారం సాయంత్రం నుంచి తెల్లవారు జాము వరకూ లక్షలాది భక్త జనం ఈ దారిన కాలినడకన ప్రయాణిస్తారు.

అప్పన్న నామస్మరణతో వచ్చే భక్తులకు ఈ శంఖుచక్రనామాలు వెలుగులీనితే మరింత భక్తభావం కలగడమే కాకుడా శోభాయమానంగా ఉంటుందని ఈ ప్రాంతీయులు అంటున్నారు. కనీసం ఈ ఒక్క రోజైనా వెలిగించండంటూ విజ్ఞప్తి చేస్తున్నారు.

నకిలీ టాస్క్‌ఫోర్స్ పోలీసుల ముఠాలో 9 మంది అరెస్టు

చాదర్‌ఘాట్ (హైదరాబాద్) జూలై 8 (ఆంధ్రజ్యోతి) : టాస్క్‌ఫోర్స్ పోలీసుమని చెప్పి రూ.50 లక్షలు దోపిడీ చేసిన ఓ ముఠాలో 9 మందిని సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి మలక్‌పేట క్రైం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

ఓల్డ్ బోయిన్‌పల్లి నివాసి మెడికల్ వ్యాపారి అయిన నిమ్మల రవీందర్‌గౌడ్ (54), బోయిన్‌పల్లి నివాసి రియల్ ఎస్టేట్ వ్యాపారి గజ్జెల్లి విజయ్‌చంద్ర అలియాస్ విజయ్(30), సికింద్రాబాద్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి కొల్లి లింకన్‌బాబు (37), ఈది బజార్ నివాసి సయ్యద్ దస్తగిరి ఖాద్రీ ఎలియాస్ ఇషాన్ (23), మాదన్నపేట నివాసి దర్శనం మురళి (32), సైదాబాద్ నివాసి రాపిడో రైడర్ అవులే రాము (27), రంగారెడ్డి జిల్లాకు చెందిన నింజాకార్ట్ ఉద్యోగి పిస్నీటి నవీన్‌రెడ్డి ఎలియాస్ శ్రీకాంత్(37), చందానగర్ నివాసి ఈ.అశోక్‌గౌడ్ (45), విశాఖపట్నం గాజువాకకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఈగల రమణ (47) మరికొంతమంది ఓ ముఠాగా ఏర్పడ్డారు. కమీషన్ తీసుకుని కంపెనీల నుంచి సీఎస్‌ఆర్ ఫండ్‌లను భారీ మొత్తంలో ఇప్పిస్తామని నమ్మిస్తూ కొందరిని బుట్టలో వేసుకుంటారు. ఆన్‌లైన్‌లో అమౌంట్ ట్రాన్స్‌ఫర్ చేస్తున్నట్లుగా నటిస్తూ తమ కమిషన్‌ను క్యాష్ రూపంలో తీసుకుంటారు. అదే సమయంలో ఆ ముఠాలోని మరికొందరు టాస్క్‌ఫోర్స్ పోలీసులమని చెప్పి ఇంత డబ్బు ఎక్కడిదని, లెక్కలు చూపాలని బెదిరిస్తూ కమీషన్ తీసుకున్న యువకులతోపాటు నగదు తీసుకుని వెళుతుంటారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు



రక్తదానం చేస్తున్న కేకే రాజు, వైసీపీ ఇతర నాయకులు

మద్దిలపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ఎంపీ గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నాయకులు వైఎస్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో నాయకులు రక్తదానం చేశారు. ముందుగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కెకె రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో 108, ఆరోగ్యశ్రీ సేవలు ప్రవేశపెట్టిన ఘనతవైఎస్‌దే అన్నారు. పేదలకు కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన మహానేత అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తైనాల విజయకుమార్, వెంకట్రామయ్య, డిప్యూటీ మేయర్ సతీష్, సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, నాయకులు ఉరుకూటి చందు, రవిరెడ్డి, దొడ్డి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, జూలై8 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన ఏకైక ముఖ్య మంత్రి వైఎస్‌రాజశేఖర్ రెడ్డి అని వైసీపీ 13 వ వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకటరావు అన్నారు. సోమవారం 13వ వార్డులోగల ఆఖరి బస్టాప్ వద్ద వార్డులో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేదలకు చీరలు, పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు.



మహిళలకు చీరలు అందిస్తున్న వైసీపీ నేతలు



ఎంపీ శ్రీభరత్‌కు ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఉపాధ్యాయులు

పేరెంట్స్ టీచర్స్ మీట్‌కు ఎంపీకి ఆహ్వానం

అక్కయ్యపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో గురువారం జరగనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం)కు హాజరవ్వాలని కోరుతూ ఎంపీ ఎం.శ్రీభరత్‌కు ప్రధానోపాధ్యాయిని ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఘనంగా నూకాలమ్మ జాతర



అమ్మవారి ఊరేగింపులో భక్తులు

సీతమ్మధార, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెం గ్రామ దేవత వేపచెట్టు నూకలమ్మ అమ్మవారి మహోత్సవాని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని అమ్మవారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో కమిటీ పెద్దలు భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

సీతంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 25వ వార్డులో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు ఐదుగురు పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా వారికి సీతంపేటలో ఒక ఫంక్షన్ హాలులో సన్మాన కార్యక్రమం మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ వాళ్లను శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

హనుమాన్‌కు ప్రత్యేక పూజలు

మాధవధార, జులై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ దగ్గరున్న యోగ సిద్ధాంజనేయ ఆలయం మంగళవారం అర్చకులు సింధూర పూజలు మంగళవారం చేశారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అనంతరం భక్తులచే సామూహిక సుందరకాండ పారాయణం వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపకులు పి. సుబ్బరాజు, కమిటీ సభ్యులు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా కుంచుమాంబ పండుగ

మాధవధార, జులై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ దేవత కుంచుమాంబ అమ్మవారి ఆలయ వార్షిక మహోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఆలయంలో అమ్మవారి విగ్రహానికి పసుపు నీటితో జలాభిషేకం చేశారు. భక్తులకు ఉత్సవ కమిటీ సౌకర్యాలు కల్పించింది. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బహిరంగ వేలం రేపు

మహారాణిపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జోన్ 4 పరిధిలో షాపులను, వాణిజ్య సముదాయాలను గురువారం ఉదయం గంటలకు సూర్యాబాగ్ కార్యలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. జీవీఎంసీకి చెందిన జగదంబా, పద్మానగర్, సూర్యాబాగ్, టీఎస్ఆర్, రెల్లీ, అంగటి దిబ్బ, డైస్ ట్యాంక్ వాణిజ్య సముదాయాలకు, ఓల్డ్ బస్టాండ్ ఫేస్ 1 ,ఫేస్ 2, రెల్లి వీధి అంబేడ్కర్ కల్యాణ మండపం, రోడ్ సైడ్ ఫిష్ మార్కెట్‌లకు బహిరంగ వేలం నిర్వహించనునట్లు ప్రకటనలో తెలిపారు.





మహిళలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్ఆర్‌సీపీ ఉత్తర నియోజకర్గ ఇన్‌చార్జి కేకే రాజు తదితరులు, వృద్ధులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న బానాల తరుణ్

ఘనంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి

సీతమ్మధార, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 24వ వార్డులో దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని మంగళవారం కార్పొరేటర్ సాడి పద్మరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేకే. రాజు ముఖ్యఅతిథిగా హాజరై రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. కార్పొరేటర్ సాడి పద్మ మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు రొట్టెలు, పండ్లు పంపిణీ

అక్కయ్యపాలెం (ఆంధ్రజ్యోతి) : దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో మంగళవారం వైసీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం నాయకుడు బానాల తరుణ్‌కుమార్ పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాజశేఖర్ రెడ్డికి ఘనంగా నివాళులు

మహారాణిపేట (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతిని మంగళవారం జగదాంబ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జి కేవీ. సూర్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలనలో రాజశేఖర్ రెడ్డి 108, ఆరోగ్యశ్రీ, రైతు రుణమాఫీ తీసుకువచ్చిన నేత అని కొనియాడారు. రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రి చేసే వరకు కలసి కట్టుగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్‌సెల్ అధ్యక్షుడు కస్తూరి వెంకటరావు, చెన్నా అప్పారావు హర్షద్ బాషా తదితర నాయకులు పాల్గొన్నారు.

మురళీనగర్, (ఆంధ్రజ్యోతి): దివంగత నేత మాజీ సీఎం డాక్టర్. వై.ఎస్.రాజశేఖర రెడ్డి 76వ జయంతి వేడుకల్ని మంగళవారం మాధవధార ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. 49వవార్డు బర్మాక్యాంపు ఏఎస్సార్ నగర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి నగర వైసీపీ అధ్యక్షుడు కేకే.రాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ కె.సతీశ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణకు సర్వం సిద్ధం



కరెంట్ ఆఫీసు దగ్గర ఏర్పాటు చేసిన టాయిలెట్లు

మురళీనగర్, జూలై 2025 (ఆంధ్రజ్యోతి): సింహాచలం శ్రీ వరహాలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఆషాడ పౌర్ణమి సందర్భంగా చతుర్దశి నాడు లక్షలాది మంది భక్తులు అప్పన్న సింహగిరి ప్రదక్షిణ చేయడం ఏళ్లనాటి ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. ఈనెల 9న బుధవారం సింహాచలంలోని ఆలయ తొలిపావంచా నుంచి భక్తులు గిరిప్రదక్షిణగా బయలుదేరి పాత అడివివరం, ముడసర్లోవ, విశాలాక్షినగర్, ఎంవీపీకాలనీ, ఇసుకతోట, బీఎస్.లేఅవుట్, పోర్టు స్టేడియం, మురళీనగర్, మాధవదార, ఎన్ఏడి జంక్షన్ దాటి గోపాలపట్నం మీదుగా 32 కిలోమీటర్ల గిరిప్రదక్షిణ పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో గిరిప్రదక్షిణ మహోత్సవానికి దేవస్థానం నుంచి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వేంద్ర. త్రినాథరావు పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తి చేశారు. తాగునీరు, భక్తులకు వైద్య సదుపాయం, రోడ్ల మరమ్మతులు నుంచి ప్రసాదాల పంపిణీ వరకు భక్తులతో కలసి కదిలే అప్పన్న పుష్ప రథానికి అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఉత్సవానికి తాత్కాలిక శిబిరాలను జీవీఎంసీ భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఉత్సవాన్ని విజయవంతం చేసేందుకు నగర పోలీసులు సహాయంతో అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.

మహిళకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

విశాఖపట్నం/డాబాగార్డెన్స్ జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెట్ కార్పొరేషన్, స్కిల్ హబ్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ విశాఖ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళలకు ప్రత్యేకంగా ఉచిత కంప్యూటర్ కోర్సు నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. మంజుల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసక్తి కలవారు ఈ కోర్సులో చేరవచ్చని తెలిపారు. మూడు నెలలపాటు నిర్వహించే ఈ కోర్సులో చేరేవారు పదవ తరగతి, ఆపై విద్యార్హత కలిగి ఉండాలని స్పష్టం చేశారు. మరన్ని వివరాలకు ఫోన్:9121676360 నంబర్‌కు సంప్రదించాల ని సూచించారు.

బధిరుల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

అక్కయ్యపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ పార్కులో డఫ్ ఎనబల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం బధిరుల బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. క్రీడాకారులు ఒకరికొకరు పోటీ పడి ఆడారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పూజ, శైలజ, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఎల్ టీ20 ప్రారంభం

▸▸ తొలి మ్యాచ్‌ల విజేతలగా గేమ్ చేంజర్స్, రాయల్ టైగర్స్

విశాఖపట్నం, స్పోర్ట్సు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే క్రికెట్ గ్రౌండ్‌లో ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నీ (ఎఫ్‌సీఎల్) ఘనంగా ప్రారంభమైంది. విశాఖ ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ సంయుక్తంగా నిర్వహించిన ఈ టోర్నీకి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సరేంద్రమోహన్ ముఖ్య అతిథిగా హాజరై మ్యాచ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటోగ్రాఫీ, వీడియోగ్రాఫీ రంగాల్లో బిజీగా ఉన్న క్రీడలపై ఆసక్తితో ఇటువంటి టోర్నీలో ప్రాతినిధ్యం వహించడం వర్ధమాన క్రికెటర్లకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు. తొలి రోజు జరిగిన మ్యాచ్‌ల్లో గేమ్ చేంజర్స్ 37 పరుగుల తేడాతో కాప్పర్ కింగ్స్‌పై, మరో మ్యాచ్‌లో రాయల్ టైగర్స్ 12 పరుగుల తేడాతో క్రికెట్ చాంపియన్స్‌పై విజయం సాధించాయి.

'ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం'

సీతమ్మధార, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాంతాల్లో 'సుపరిపాలనలో ఏడాది' కార్యక్రమాని మంగళవారం నిర్వహించారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు గొంప ధర్మరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దువ్వరపు రామారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్, విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోలమరశెట్టి శ్రీనివాస్ ఇంటింటికి వెళ్లి ఏడాది పాలన గురించి అడిగి తెలుసుకున్నారు. ఏడాదిలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సుపరిపాలనలో ఏడాది కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

స్కూళ్లు, రేషన్ డిపోల్లో ఫుడ్ కమిషన్ తనిఖీలు

మురళీనగర్, జులై 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆహారభద్రత చట్టం 2013 అమలు పర్యవేక్షణలో భాగంగా మంగళవారం రాష్ట్ర ఫుడ్‌కమిషన్ సభ్యులు బి.కాంతారావు విశాఖజిల్లాలోని స్కూళ్లు అంగన్వాడీకేంద్రాలు, రేషన్ డిపోలను తనిఖీ చేశారు. పితాని దిబ్బ, దండు బజారు, మురళీనగర్, తాటిచెట్ల పాలెం, జెండా చెట్టు వీధి, రైల్వే న్యూకాలనీ, రాంజోగిపేట ప్రాంతాల్లో పలు చోట్ల లోపాల్ను గుర్తించారు. జెండాచెట్టు, రైల్వేన్యూకాలనీలోని రేషన్ డిపోల్లో స్టాక్ వ్యత్యాసాన్ని గుర్తించి కేసు నమోదు చేశారు. పర్యటనలో భాగంగా మాధవధార హైస్కూల్లో పర్యటించారు. ఆ స్కూల్లో కోడి గుడ్ల రికార్డులను స్వయంగా పరిశీలించి కొన్ని తప్పుడు లెక్కలను గుర్తించారు. వీరిపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అధికారులు, లీగల్ మెట్రాలజీ, ఫుడ్ అండ్ సేఫ్టీ, విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ల అధికారులు హాజరయ్యారు.

స్కూల్ తెరవాలని తల్లిదండ్రుల ఆందోళన



స్కూల్ ఎదుట ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

సీతంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ మూడోలైన్‌లో ఉన్న రవీంద్రభారతి పాఠశాల స్టాఫ్ ఈఎస్ఐ కంట్రీబ్యూషన్ కొన్ని సంవత్సరాలుగా చెల్లించక పోవడంతో ఈఎస్ఐ అసిస్టెంట్ కమిషనర్ నోటీలు జారీ చేసి పాఠశాలను సీజ్ చేశారు. దీంతో స్కూల్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల తెరవాలని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో యాజమాన్యం స్పందించి సమస్యను పరిష్కరించి స్కూల్‌ను ప్రారంభిస్తామని తెలిపారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంక్ ఉద్యోగులు

సీతమ్మధార, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ యాజమాన్యాలు కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా, జాతీయ కార్మిక సమాఖ్య డిమాండ్లను బలపరుస్తూ దేశవ్యాప్తంగా బుధవారం జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను చేపట్టారు. ఈ సందర్భంగా సమ్మెను విజయవంతం చేయాలని సీతమ్మధారలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద మంగళవారం నిరసన నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నగరంలో పలు బ్యాంక్‌ల నుంచి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి ఆర్ వసంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం చేపటనున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని, సార్వత్రిక సమ్మెలో బ్యాంక్ ఉద్యోగులు, భీమ సంస్థ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో పలువురు బ్యాంక్, బీమా సంస్థల ఉద్యోగులు పాల్గొన్నారు.

గురు పౌర్ణమికి ధ్యానమందిరం ముస్తాబు



ముస్తాబైన సాయి మందిరం

అక్కయ్యపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని జీవీఎంసీ 42వ వార్డులో ఉన్న షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం ముస్తాబైంది. ఈ మేరకు ఆలయాన్ని విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించారు. గురుపౌర్ణమి రోజు ఉదయం 8 గంటల నుంచి భక్తులు స్వహస్తాలతో క్షీరాభిషేకం, రాత్రి 7 గంటలకు పల్లకి మహోత్సవం, సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు భజన కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. ఉదయం 11 నుంచి మహా అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. భక్తులకు బాబా ఫొటో, పంచముఖ రుద్రాక్షలు, షిర్డీ సంస్థాన్ నుంచి తీసుకొచ్చిన విభూది, బాబా పుస్తకాలు పంపిణీ చేస్తామని చెప్పారు.

గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు ఎన్నడో?

▸▸ పైప్‌లైన్ కోసం తవ్విన రోడ్డు

▸▸ పనుల్లో నాణ్యత లోపమని ఆరోపిస్తున్న స్థానికులు

▸▸ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని ప్రజల విమర్శలు

జ్ఞానాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమం కోసం అప్పటికప్పుడు మరమ్మతులు చేసిన రోడ్లు నేడు గుంతలమయంగా మారాయి. ఇంజనీరింగ్ అధికారులు తీరుతో లక్షల రుపాయాల ప్రజాదనం వృథాగా పోయింది. ఇటువంటి పులు కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకు తప్ప ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. యోగాంధ్ర సమయంలో జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయం నుంచి కాన్వేంటు కూడలి, అటు అల్లిపురం నుంచి డాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం రోడ్లలో నీటి సరఫర కోసం జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు తవ్వించిన రోడ్లకు సరిగా మరమ్మతులు చేయించకపోవడంతో నేడు అవి పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రజాధనం వృథా అయ్యే ఇటువంటి పనులు జీవీఎంసీ అధికారులు మానుకోవాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

రోజులు గడుస్తున్న రోడ్లు బాగుపడడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

సింహగిరికి ఉత్సవ శోభ

... 5వ పేజీ తరువాయి

ఏర్పాట్లు తనిఖీ చేశారు. గిరి ప్రదక్షిణ సందర్భంగా బుధ, గురువారాల్లో దేవస్థానంలో నిత్యకల్యాణం, సుప్రభాత సేవ, ఆరాధనసేవ, అష్టోత్తర, సహస్ర నామార్చన వంటి ఆర్జిత సేవలు రద్దు చేశారు. అదేవిధంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండు రోజులు నీలాద్రి గమ్మం వద్ద నుంచి అప్పన్న దర్శనాలు కల్పించనున్నారు.

పదో తేదీన...

పదో తేదీ తెల్లవారుజామున ఒంటి గంటకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలుపుతారు. 2.30 గంటల నుంచి 4 గంటల వరకూ మూడు మణుగుల చందనం సమర్పిస్తారు.

4 నుంచి ఐదు గంటల వరకు ప్రభాత ఆరాధన, బాలభోగం, రాజభోగాల నివేదనలు కావిస్తారు. ఉదయం 5.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకూ నిరంతరాయంగా భక్తులకు స్వామివారి దర్శనాలు కల్పిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 4.00 గంటల వరకూ పవళింపుసేవ, ఢిల్లీ విజయం ఉత్సవం జరుగుతాయి.

ఈ కారణంగా మధ్యాహ్నం 3.30 నుంచి 5.30 గంటల వరకు భక్తులకు దర్శనాలు లభించవు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు భక్తులకు స్వామివారి దర్శనాలు ఉంటాయి. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకకూ రాత్రి ఆరాధన (భక్తులకు దర్శనాలు లభించవు), 9 గంటలకు పవళింపుసేవ ఉంటాయి. అనంతరం కవాట బంధనం చేస్తారు.

సింహగిరి ప్రదక్షిణ భూప్రదక్షిణతో సమానం

... 5వ పేజీ తరువాయి

సంహరించే సమయంలో విష్ణువు 32 రూపాలు ధరించాడని, అదేవిధంగా నృసింహస్వామి మూలమంత్రంలో 32 బీజాక్షరాలు ఉన్నాయని అందుకే 32 కిలోమీటర్ల వ్యాసార్థం కలిగిన సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూప్రదక్షిణ చేసినంత ఫలాన్ని ఇస్తుందని అంటారు. గురుపౌర్ణమిగా నాడే సింహగిరి ప్రదక్షిణ ఎందుకు చేయాలంటే...వేదవ్యాసుడు వేదాలను విభజించి మానవాళికి గురువుగా పూజించబడుతున్నాడు. భగవానుడి తత్వాన్ని విశ్వానికి తెలిపిన వ్యాసుడు జయంతికి ప్రత్యేకత ఉంది. గురువు అంటే పెద్దది, విశ్వం అని అర్థాలు ఉన్నాయి. ఏటా వైశాఖమాస శుక్లపక్ష తదియ, పౌర్ణమి, జేష్ట, ఆషాఢ పౌర్ణమిలలో నాలుగు విడతలుగా చందనాన్ని పైపూతగా సమర్పించడంతో సింహాద్రినాథుడు గురు (పెద్ద)రూపం సంతరించుకుంటాడు. అందుకే వ్యాసపూర్ణిమ నాడు గిరి ప్రదక్షిణ చేస్తారని సింహాద్రి అప్పన్న ఆలయ స్థానాచార్యులు తెలిపారు.

కూటమి నేత మాస్టర్ ప్లాన్

... 5వ పేజీ తరువాయి

రోడ్డుకు ఒక వైపు 93 స్ట్రక్చర్లు, మరోవైపు 49 స్ట్రక్చర్లు మొత్తంగా 142 స్ట్రక్చర్లు ఎఫెక్ట్ అవుతున్నట్టు గుర్తించారు. ఆయా స్ట్రక్చర్లు 50,012 చదరపు మీటర్లు వైశాల్యంలో ఉన్నట్టు ఆర్‌డీపీలో పేర్కొన్నారు.

టీడీఆర్‌లు కొట్టేసేందుకే ఎత్తుగడ

అవసరం లేని రోడ్డును విస్తరించాలంటూ ప్రతిపాదించడం వెనుక టీడీఆర్‌లు కొట్టేయాలనే ఎత్తుగడ ఉందని కూటమి కార్పొరేటర్లు కొందరు ఆరోపిస్తున్నారు. ఆ రహదారికి ఆనుకుని ఇరువైపులా ప్రభుత్వ స్థలాలతోపాటు కొన్ని ప్రైవేటు స్థలాలను బినామీ పేర్లతో కలిగివున్న కూటమికి చెందిన నేతే వెనకుండి అధికారులతో కథ నడిపిస్తున్నారని స్వపక్షానికి చెందిన కార్పొరేటర్లే ఆరోపిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడున్న 40 అడుగుల సీసీ రోడ్డులోనే పెద్దగా జనసంచారం ఉండదని, చివరన రైల్వే ట్రాక్ ఉండడంతో భవిష్యత్తులో రద్దీ పెరిగే అవకాశం లేదని స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ అధికార బలంతో జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులపై ఒత్తిడి తెచ్చి అవసరం లేకపోయినా మాస్టర్‌ప్లాన్‌లో రోడ్డు విస్తరణ పెట్టించి, ఆగమేఘాల మీద ఆర్‌డీపీ చేశారని కూటమి కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. ఆర్‌డీపీలో సేకరించాలనుకున్న భూముల్లో చాలావరకు ఆక్రమణలే ఉన్నాయని, వాటికి కూడా పరిహారంగా టీడీఆర్ ఇచ్చేలా అధికారులు ఫైల్ సిద్ధం చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ విషయం టౌన్‌ప్లానింగ్ అధికారుల వద్ద ప్రస్తావించగా ఆ రోడ్డులో కొంతభాగంపై కోర్టులో కేసు నడుస్తోందని, ఆర్‌డీపీ గురించి ఫైల్ పరిశీలించిన తర్వాతే మాట్లాడగలమని తప్పించుకుంటుండడం విశేషం.

నిరుపయోగంగా ట్యాబ్‌లు

... 5వ పేజీ తరువాయి

బోధిస్తున్నారు. ట్యాబ్‌ల విషయం మరిచిపోయారు. అంతేకాక ట్యాబ్‌లలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయకపోవడంతో చాలావరకు పనిచేయడం లేదు. కొన్ని అసలు ఆన్ కావడం లేదు. ఎక్కడైనా టీచర్లు చొరవ తీసుకుని ట్యాబ్‌ల ద్వారా బోధిద్దామని యత్నించినా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కాక పనిచేయడం లేదు.

ట్యాబ్‌లు సరఫరా చేసిన కంపెనీ టెక్నిషియన్లు పాఠశాలలకు వచ్చి వాటిని అప్‌డేట్ చేయాల్సి ఉంది.

విద్యా శాఖలో ట్యాబ్‌లు, ఇతరత్రా సాంకేతిక అంశాలు పర్యవేక్షించే విభాగం కూడా ఈ అంశం పట్టించుకోవడం లేదు. మొత్తంగా కోట్ల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ట్యాబ్‌ల కథ అలా ముగిసింది.

డిప్యూటీ తహశీల్దార్లకు తాత్కాలిక పదోన్నతులు

... 5వ పేజీ తరువాయి

స్థానాలు దక్కించుకున్నారు. అయితే అక్కడ వారిని చేర్చుకోవడానికి స్థానిక ప్రజాప్రతినిధులు అంగీకరించలేదు. మాట మాత్రం చెప్పకుండా వారిని ఎలా నియమిస్తారంటూ అడ్డం పడ్డారు. దాంతో కొందరు ఆయా మండలాల్లో బాధ్యతలు చేపట్టలేకపోయారు. ఇప్పుడు ఆ స్థానాలను కూడా డిప్యూటీ తహశీల్దార్లతో భర్తీ చేశారు. విశాఖ జిల్లాలో ఆనందపురం తహశీల్దార్‌గా సూరిశెట్టి శ్రీనుబాబును, గాజువాక తహశీల్దార్‌గా బాతుల శ్రీనివాసరావును, పెందుర్తికి ఎ.సంతోష్ కిరణ్‌ను నియమించారు. అదేవిధంగా అనకాపల్లికి పి.సత్యనారాయణను నియమించారు. మిగిలిన వారందరనీ అల్లూరి సీతారామరాజు జిల్లాలో నియమించారు.

కేకే లైన్‌లో రైళ్ల పాక్షిక రద్దు

... 5వ పేజీ తరువాయి

కోరాపుట్ వరకూ, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ పాసింజర్ (58502) కోరాపుట్‌లో బయలుదేరి విశాఖ చేరుతుంది. కోరాపుట్, కిరండూల్ మధ్య రాకపోకలు రద్దు చేశారు.

హౌరా-జగదల్‌పూర్ సమలేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (18005) ఈనెల 8 నుంచి 10 వరకు హౌరాలో బయలుదేరి కోరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో (18006) ఈనెల 10 నుంచి 12 వరకు కోరాపుట్‌లో బయలుదేరి హౌరా చేరుతుంది. ఈ సర్వీసులకు కోరాపుట్-జగదల్‌పూర్ మధ్య రాకపోకలు రద్దు చేశారు. ఇక భువనేశ్వర్-జగదల్‌పూర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (18447) ఈనెల 10 వరకు భువనేశ్వర్‌లో బయలుదేరి కోరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్-భువనేశ్వర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (18448) కోరాపుట్ నుంచి బయలుదేరి భువనేశ్వర్ చేరుతుంది.

ఇక్కడ పనిచేయడం ఇష్టం లేకుంటే చెప్పండి

... 5వ పేజీ తరువాయి

ఎందుకు ప్రతిపాదించారంటూ ప్రశ్నించారు. గిరి ప్రదక్షిణ మార్గంలో పూర్తిస్థాయిలో విద్యుత్ వెలుగులు ఉండేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో దేవాలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈలు రాంబాబు, రామకృష్ణ, సీహెచ్ వెంకట రమణ, ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, 98వ వార్డు తెదేపా అధ్యక్షులు పంచదార్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల వలకు టో ఫిష్ పరికరం



వలకు చిక్కిన టోఫిష్ పరికరం

మహారాణి పేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో ల్యాండ్‌మైన్లను భూగర్భంగా ఉండే పేలుడు వస్తువులను పసిగట్టే యత్రం మత్స్యకారులకు వలకు చిక్కింది. దేశ రక్షణ కోసం సముద్ర గర్భంలో ఉండే ల్యాండ్ మైన్ వంటి పేలుడు పదార్థాలను కనుగోనే రాకెట్ ఆకారంలో ఉండే ఒక పరికరం చేపల వేటకు వెళ్ళే మత్యకారులకు వలకు చిక్కంది. మంగళవారం ఉదయం 11 గంటల చేపల వేట కోసం సముద్రంలోని సుమారు 3 కిలోమీటర్ల దూరంలో చిక్కడంతో మత్స్యకారులు మామూలు వస్తువుగా భావించి అమ్మోద్దాం అనుకున్నారు. సుమారు 1500 రూపాయలకు బేరం కూడా జరిగింది. ఈక్రమంలో ఆ నోట ఈ నోట వన్‌టౌన్ పోలీసుల చెవిన పడటంతో అది ఏమిటో చూద్దామని వెళ్ళిన దానిని స్వాధీనం చేసుకున్నారు. దీనిని వివరాలను మత్స్యశాఖ సిబ్బందికి నేవల్ అధికారులకు తెలియజేశారు. దానిని గుర్తించిన నేవల్ అధికారులు టో ఫిష్ అంటారని దీనితో సముద్ర గర్భంలో ఉండే పేలుడు వస్తువులను గుర్తించి సమాచారం అందిస్తుందని వివరించారు. నేవల్ విభాగానికి ఎంతో ఉపయోగకరమని, ఇది 2024 డిసెంబరు నెల 14 వ తేదీన సముద్రంలో కనిపించకుండా పోయిందని అన్నారు. ఈ పరికరంతో నేవల్ షిప్ కు ఉండే కమ్యూనికేషన్ కట్ అవ్వడంతో, దీని నుంచి ఎటువంటి సమాచారం లేకుండా పోయిందని తెలిపారు. ఈ పరికరం సుమారు రూ.కోటి ఉంటుందని భావించారు. దీనిని వెంటనే నేవల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

విశాఖ విమల విద్యాలయం తెరుచుకునేనా?

» పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రుల ఆందోళన
» టీసీలు తీసుకుంటున్న పలువురు విద్యార్థులు



విశాఖ విమల విద్యాలయం

ఉక్కుటౌన్‌షిప్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని విశాఖ విమల విద్యాలయాన్ని తెరవకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల తెరవకపోవడం.. దీనిని తెరిచేందుకు ఉక్కు యాజమాన్యం ముందుకు రాకపోవటంతో విద్యార్థుల భవిష్యత్తు ఆందోళనలో పడింది. పాఠశాల తెరిచే విషయంలో తొలి నుంచి పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతనెల 12న విద్యాలయం ప్రారంభమవుతుందని భావించిన విద్యార్థులు స్కూల్ బ్యాగులతో వచ్చారు. అయితే పాఠశాల తెరవకపోవడంతో అందరూ ఇంటిముఖం పట్టారు. అప్పటినుంచి విద్యాలయాన్ని ఎప్పుడు తెరుస్తారోనని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు వేచిచూస్తూ వచ్చారు. రోజులు గడుస్తున్నా పాఠశాల తెరవకపోవడంతో ఆందోళన బాట చేపట్టారు.

ఈ నేపథ్యంలో గతనెల 23న ఉక్కు యాజమాన్యంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. అప్పుడు కూడా పాఠశాల తెరిచే అంశంపై ఉక్కు యాజమాన్యం స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో అందరూ తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ విద్యాలయంలో సుమారు 1,600మంది విద్యార్థులు చదువుతుండగా... ఇప్పటివరకు సుమారు ఐదు వందల మంది టీసీలు తీసుకుని ఇతర పాఠశాలల్లో చేరినట్టు తెలిసింది. ఇదే పరిస్థితి కొనసాగితే మరికొద్ది రోజుల్లో మరింత మంది విద్యార్థులు ఇతర స్కూళ్లలో చేరే అవకాశం ఉంది. అందువల్ల ఉక్కు యాజమాన్యం, ప్రజాప్రతినిధులు స్పందించి విశాఖ విమల విద్యాలయం తెరుచుకునేలా చర్యలు చేపట్టాలని పలువురు తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యాలయాన్ని తెరవాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

ఉక్కు నగరంలోని విశాఖ విమల విద్యాలయాన్ని తెరవాలని కోరుతూ మంగళవారం పాఠశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జి.రాము మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై రోజులు గడుస్తున్నా విద్యాలయాన్ని తెరవకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని విద్యాలయం తెరుచుకునేలా తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, గుణశంకర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు వల్లే ఉక్కు బాయిలర్ కోల్‌లో మంటలు

» విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ

కూర్మన్నపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కాంట్రాక్టు కార్మికుల తొలగింపు వల్లే బాయిలర్ కోల్‌లో మంటలు చెలరేగాయని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. మంగళవారం నిర్వహించిన 1608వ రోజు రిలే నిరాహార దీక్షా శిబిరంలో మాట్లాడారు. బాయిలర్ కోల్‌లో మంటలను ఆర్పే పని గతంలో కాంట్రాక్టు కార్మికులు చేసేవారని, వారి సంఖ్య తగ్గడంలో ఆ పని మూలకు చేరిందని వాపోయారు. స్టీల్‌ప్లాంట్‌లో ఆర్ఎంహెచ్‌పీ, సెంటర్ ప్లాంట్ తదితర విభాగాలను ప్రైవేటుకు అప్పగించడం వల్ల కర్మాగారాన్ని అంధకారంలోనికి నెట్టినట్టు అవుతుందన్నారు. నాయకులు ఎస్.రామారావు మాట్లాడుతూ కార్మికుల పొట్టకొడుతూ ఉత్పత్తిని పెంచుతామన్న యాజమాన్యం నిరంకుశ పోకడలు అత్యంత హేయమైనవిగా పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంటు నిర్మాణానికి భూములు తీసుకొన్న నిర్వాసితులకు నేటి వరకూ ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కార్మికుల తొలగింపు తక్షణమే ఆపాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోనికి తీసుకోవాలని, పూర్తి స్థాయిలో వేతనాలు, ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పోరాట కమిటీ నాయకులు సత్యనారాయణ, పుల్లారావు, వెంకటేశ్వరరావు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి విరాళం


కమిటీకి విరాళాన్ని అందిస్తున్న దాతలు

అగనంపూడి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పెదమడక రామాలయం నిర్మాణానికి స్థానిక కూరగాయల వ్యాపారులు గంతకోరు రాము, నూకరాజులు రూ 31,516 విరాళాన్ని మంగళవారం ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. కమిటీ ప్రతినిధులు విందుల నారాయణరావు, చిరురాజు, కొలిపాక అప్పారావు, గోవింద్, శంకర్, సన్నీ, సతీశ్, కరుణాకర్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
● **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
● **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
● **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
● **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 32, వంకాయలు (తెలుపు)42, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 38, పచ్చిమిర్చి 64, కాకరకాయలు 36, బీరకాయలు 44, ఆనపకాయ18, కాలీఫ్లవర్40, క్యాబేజీ22, క్యారెట్ 40, దొండకాయలు 44, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో)66, అల్లం (పాతది)50, బరబాటి 38, ముల్లంగి24, నిమ్మకాయలు (కిలో) 45, బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడ 36, కంద64, దేముడు చిక్కుడు 78, గోరు చిక్కుడు 44, కూరపెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట)4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట)4, తోటకూర (కట్ట)3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడి 20, కర్రపెండలం24, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	78
లైవ్ ధర	98
విత్ స్కిన్	166
స్కిన్‌లెస్	176

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన

» 'సుపరిపాలనలో తొలి అడుగు'లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు 'పల్లా'


85వ వార్డు దిబ్బపాలెంలో కరపత్రాలను అందజేస్తున్న పల్లా శ్రీనివాసరావు


63వ వార్డులో ఎమ్మెల్యే గణబాబుకు బొట్టుపెట్టి స్వాగతం పలుకుతున్న మహిళ

అగనంపూడి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 85వ వార్డు దిబ్బపాలెంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. వైసీపీ పాలనలో అన్ని రంగాల్లో నష్టపోయిన రాష్ట్రాన్ని గాడినపెట్టి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సుపరిపాలన అందిస్తున్నారన్నారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మీప్రసాద్, కూటమి నేతలు కరణం సత్యారావు, డొక్కా రమేశ్, ఈగల నరసింగరావు, గంతకోరు అప్పారావు, తలారి వెంకటరమణ, గౌరినాయుడు, కసిపల్లి శ్రీను, తిలక్, దుల్ల చెల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

63వ వార్డులో...

సింధియా : అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన 63వ వార్డులో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. అసెంబ్లీలోకే అడుగుపెట్టలేని దుస్థితిలో ఉన్న వైసీపీ ఎమ్మెల్యేలు, ఇప్పుడు ప్రజల్లోకి వెళ్తాం అంటున్నారంటే సిగ్గుచేటుగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గల్లా పోలిపిల్లి (చిన్న), వార్డు టీడీపీ అధ్యక్షుడు జెర్రిపోతుల నర్సింగ్, నాయకులు కృష్ణతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

91వ వార్డులో...

గోపాలపట్నం : జీవీఎంసీ 91వ వార్డు నేతాజీవీధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్య సింహా మంగళవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టి అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు నేతలు ఎన్.సత్తిరాజు, బొడ్డేటి ఉమ, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

86వ వార్డులో...

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్‌నగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా వార్డు టీడీపీ అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వంలో సాధించిన ప్రగతిని వివరించారు. అనంతరం అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి వేగుంట శ్రీనివాస్, నాయకులు గణపతి, రమేశ్, జగదీశ్, సుబ్బయ్య, నాగార్జున, వెంకటేష్, నాయుడు, దయానిధి తదితరులు పాల్గొన్నారు.

న్యూపోర్టు పోలీసుల గొప్ప మనసు

» మెడికల్ సీటు సాధించిన పేద విద్యార్థినికి రూ.50 వేల ఆర్థిక సాయం


విద్యార్థిని తండ్రికి నగదు అందిస్తున్న సీఐ

పెదగంట్యాడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం అందజేసి న్యూపోర్టు పోలీసులు తమ గొప్ప మనసును చాటుకున్నారు. న్యూపోర్టు పోలీస్ స్టేషన్ గార్డెనింగ్ పనులు చేస్తున్న భూలోక రెడ్డి కుమార్తె మెడికల్‌లో సీటు సంపాదించింది. చదువుకునేందుకు ఆర్థిక స్థోమత లేక పోవడం గమనించిన న్యూపోర్టు పోలీసులు ఆమె చదువుకు ఆర్థిక లేమి అడ్డుకారాదని తలంచారు. సీఐ టి.కామేశ్వరరావు రూ.10 వేలు, స్టేషన్ సిబ్బంది రూ.40వేలు విరాళంగా సేకరించి మొత్తం రూ.50వేలను విద్యార్థిని తండ్రి భూలోకరెడ్డికి మంగళవారం అందజేశారు.

అంబేడ్కర్ సేవా శ్రీ అవార్డు గ్రహీతకు సత్కారం



జయప్రకాశ్‌ను సత్కరిస్తున్న సంస్థ అధికారులు, కార్మిక నేతలు

అక్కిరెడ్డిపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సమాజ సంక్షేమానికి పాటుపడే వారికి ఎల్లప్పుడూ ప్రత్యేక గుర్తింపు ఉంటుందని బెల్ హెచ్‌పీవీపీ ఏజీఎం ఎస్.లీల అన్నారు. వరల్డ్ దళిత ఆర్గనైజేషన్ అందించే ప్రతిష్ఠాత్మక అంబేడ్కర్ సేవా శ్రీ 2025 అవార్డును ఇటీవల హైదరాబాద్‌లో అందుకున్న సంస్థ ఉద్యోగి సుగురు జయప్రకాశ్‌ను మంగళవారం కంపెనీలో పలువురు అధికారులతో పాటు కార్మిక నాయకులు అభినందించి సత్కరించారు. డీజీఎం జి.చంద్రశేఖర్, కార్మిక నాయకులు ఎస్.సాహు, కొల్లి దేముడు, బొండా బాబూరావు, పీవీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

గాజువాక, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల డిమాండ్లను పరిష్కరించకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని కార్మిక యూనియన్ నాయకులు హెచ్చరించారు. చినగంట్యాడ లోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పాతగాజువాక నుంచి బుధవారం చేపట్టనున్న ర్యాలీలో అంతా భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు గొలగాని అప్పారావు, ఎం.రాంబాబు, నూకేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ టాస్క్‌ఫోర్స్ పోలీసుల ముఠాలో తొమ్మిది మంది అరెస్టు

చాదర్‌ఘాట్, (హైదరాబాద్) జూలై 8 (ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్స్ పోలీసుమని చెప్పి రూ.50 లక్షలు దోపిడీ చేసిన ఓ ముఠాలో తొమ్మిది మందిని సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి మలక్‌పేట క్రైం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఓల్డ్ బోయిన్‌పల్లి నివాసి మెడికల్ వ్యాపారి అయిన నిమ్మల రవీందర్‌గౌడ్ (54), బోయిన్‌పల్లి నివాసి రియల్ ఎస్టేట్ వ్యాపారి గజ్జెల్లి విజయ్‌చంద్ర ఎలియాస్ విజయ్, సికింద్రాబాద్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి కొల్లి లింకన్‌బాబు, ఈదిబజార్ నివాసి సయ్యద్ దస్తగిరి ఖాద్రీ ఎలియాస్ ఇషాన్, మాదన్నపేట నివాసి దర్శనం మురళి, సైదాబాద్ నివాసి రాపిడో రైడర్ అవులే రాము, రంగారెడ్డి జిల్లాకు చెందిన నింజాకార్ట్ ఉద్యోగి పిస్నీటి నవీన్‌రెడ్డి ఎలియాస్ శ్రీకాంత్, చందానగర్ నివాసి ఈ.అశోక్‌గౌడ్, విశాఖపట్నం గాజువాకకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఈగల రమణ మరికొంతమంది ఓ ముఠాగా ఏర్పడ్డారు. కమీషన్ తీసుకుని కంపెనీల నుంచి సీఎస్ఆర్ ఫండ్‌లను భారీ మొత్తంలో ఇప్పిస్తామని నమ్మిస్తూ కొందరిని బుట్టలో వేసుకుంటారు. ఆన్‌లైన్‌లో అమౌంట్ ట్రాన్స్‌ఫర్ చేస్తున్నట్లుగా నటిస్తూ తమ కమీషన్‌ను క్యాష్ రూపంలో తీసుకుంటారు. అదే సమయంలో ఆ ముఠాలోని మరికొందరు టాస్క్‌ఫోర్స్ పోలీసులమని చెప్పి ఇంత డబ్బు ఎక్కడిదని, లెక్కలు చూపాలని బెదిరిస్తూ కమీషన్ తీసుకున్న యువకులతో పాటు నగదు తీసుకుని వెళుతుంటారు.

నమ్మించి.. డబ్బు దోచేసి

గత ఆదివారం సేవారథ్ విజయపథ్ ట్రస్ట్ నిర్వహిస్తున్న మంచిర్యాలకు చెందిన రాళ్లబండి విజయ్‌కుమార్ వద్ద ఈ ముఠా సభ్యులు ప్లాన్‌ను పక్కాగా అమలు చేసి డబ్బు కొల్లగొట్టారు. ఓ కంపెనీ నుంచి సీఎస్ఆర్ ఫండ్ ద్వారా రూ.కోటి విరాళం ఇప్పిస్తామని చెప్పి నమ్మించారు. ఆన్‌లైన్ ద్వారా డబ్బు ట్రాన్స్‌ఫర్ అవుతున్నట్లు చూపుతూ రూ.50లక్షలను నగదు రూపంలో తీసుకున్నారు. అదే సమయంలో మరోముగ్గురు వ్యక్తులు టాస్క్‌ఫోర్స్ పోలీసుల పేరిట వారిని బెదిరించి ఆ మొత్తాన్ని దోచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మలక్‌పేట క్రైం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. నగదు కాజేసిన ముఠాలో 14మంది ప్రమేయమున్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది. క్రైం పోలీసులు, సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సేకరించిన కాల్ డేటా, సాంకేతిక ఆధారాలతో 9మంది నిందితులను పట్టుకున్నారు. అందులో ఒకరి వివరాలు తెలియాల్సి ఉంది. అయితే, అదుపులో ఉన్న వారిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులమంటూ వచ్చిన సయ్యద్ దస్తగిరి ఖాద్రీ కూడా ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వీరి నుంచి రూ.6.94 లక్షలు, 8 మొబైల్ ఫోన్లు, మూడు బైకులను స్వాధీనం చేసుకున్నామని, అందరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వాడవాడలా ఘనంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి


పెందుర్తి జంక్షన్‌లో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు కేక్ తినిపిస్తున్న మాజీ కార్పొరేటర్ శరగడం

అక్కిరెడ్డిపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలూ కృషి చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా మిందిలో మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు గుడివాడ అప్పలరామ్మూర్తి, గుడివాడ లతీశ్, సంగ్రాన నూకరాజు, ఈటి సురేష్, నేలపాటి సత్యవతి, జి శాంతకుమారి పాల్గొన్నారు.

పెందుర్తి : వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు పెందుర్తి జంక్షన్‌లో గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. లయోలా వృద్ధాశ్రమంలో భోజనం ఏర్పాటు చేశారు. ఎంపీపీ మధుపాడ నాగమణి, జడ్పీటీసీ ఉప్పిలి కనకరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు గొరపల్లి శ్రీను, వైసీపీ నేత బయిలపూడి భగవాన్‌జయరామ్, మజ్జి రఘు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం : వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని 87వ వార్డు కూర్మన్నపాలెం, కణితి గాంధీ బొమ్మ సెంటర్‌లో నిర్వహించారు. వైఎస్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే వెంకట్రామయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు వేణుబాబు, ప్రగడ విజయలక్ష్మీ, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, ఇల్లపు రాము, బొండా గోవింద రాజు, శంకరరావు, సన్యాసి నాయుడు, వెంకట నారాయణ, సత్తిబాబు పాల్గొన్నారు.

అగనంపూడి : వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని 85వ వార్డులో నిర్వహించారు. ఇక్కడి కూడలిలో గల ఆయన విగ్రహానికి వైసీపీ వార్డు అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మహాలక్ష్మినాయుడు, గుర్రం శ్రీను, మామిడి శ్రీను, నక్కా రమణబాబు, యలమంచిలి చినఅప్పారావు, ఇల్లపు వాసు, సోమునాయుడు పాల్గొన్నారు.

మల్కాపురం : రాజశేఖర్‌రెడ్డి జయంతిని మల్కాపురం ప్రధాన కూడలిలో వైసీపీ 61వ వార్డు అధ్యక్షుడు పిలక రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు భోగవిల్లి నాగభూషణం, పీలా అనంత్‌కుమార్, చట్టి నూకరాజు, అప్పలరెడ్డి, బద్రీరెడ్డి తదితరులు పాల్గొన్నారు. హెచ్‌పీసీఎల్ రఫ్ గేటు వద్ద వైఎస్ఆర్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కార్పొరేటర్లు పీవీ సురేష్, బల్ల లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొని కేక్‌కట్‌చేశారు. వార్డుల వైసీపీ అధ్యక్షులు బీశెట్టి గణేష్, అంగ వర్మ, వై.రాజు, వైఎస్ఆర్ టీయూసీ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా పిలకవానిపాలెం జంక్షన్‌లో జరిగిన వైఎస్ఆర్ జయంతిలో 58వ వార్డు కార్పొరేటర్ గులిగింద లావణ్య, వార్డు సీనియర్ నాయకుడు గులిగిందల కృష్ణ పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


శాకాంబరీ అలంకరణలో దుర్గాలమ్మ, నూకాలమ్మ, పోలిపిల్లమ్మ

శాకాంబరీగా త్రిశక్తి అమ్మవార్లు

కూర్మన్నపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి లక్ష్మీపురంలో మంగళవారం దుర్గాలమ్మ, నూకాలమ్మ, పోలిపిల్లమ్మ అమ్మవార్లను వివిధ రకాల కూరగాయలు, కాయగూరలు, పండ్లతో శాకాంబరీ మాతలుగా అలంకరించారు. ప్రధాన అర్చకులు వాసుస్వామి, హరీశ్‌శర్మ, చక్రపాణి శర్మల ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్ష సూత్రధారణ, ఉత్సవ సంకల్పం, మండపారాధనలు, పంచామృతాభిషేకాలు చేశారు. అలాగే శ్రీరాజశ్యామల హోమం జరిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు మహిళలు లలితా సహస్రనామ పారాయణాన్ని, అమ్మవారి భక్తి గీతాలను ఆలపించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. ఆలయ కమిటీ ప్రతినిధులు అవిరెడ్డి సూర్యనారాయణ,కె.రామరాజు, ఎస్.బాబూరావు, బి.అప్పలరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఆధునిక టెక్నాలజీ బస్సులపై శిక్షణ


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న టాటా కమాండ్స్ ఇంజనీర్ గోపి

ద్వారకాబస్‌స్టేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలోకి నూతన టెక్నాలజీతో కూడిన బస్సులు వచ్చాయని, ఇంకా రాబోతున్నాయని టాటా కమాండ్స్ ఇంజనీర్ గోపి అన్నారు. ఆధునిక టెక్నాలజీని అవగాహన చేసుకొని అందుకు తగిన సాంకేతి సామర్థ్యాన్ని ప్రదర్శించినప్పుడే సత్ఫలితాలు సాధ్యమన్నారు. ఇటీవలగా ఆధునిక సాంకేతికతో వచ్చిన బస్సుల మెకానిజంపై మంగళవారం విశాఖపట్నం డిపోలో గ్యారేజీ సిబ్బందికి ఏర్పాటైన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. టాటా కమాండ్స్ ఇంజన్ పనితీరు, వాటి నిర్వహణపై గ్యారేజీ ఇంజనీర్లకు, మెకానిక్‌లకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, విశాఖపట్నం డిపో మేనేజర్ గంగాధర్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్లు రామకృష్ణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'జీవీఎంసీ ఆస్పత్రిలో ఉచితంగానే వైద్య సేవలు'

మల్కాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రి (ఎఫ్ఆర్‌యూ)లో ఉచితంగా వైద్య సేవలందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. ఇక్కడి జైయాంధ్ర కాలనీలో 63వ వార్డు కార్పొరేటర్ గల్లా పోలిపిల్లి (చిన్న) కార్యాలయం వద్ద మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎఫ్ఆర్‌యూలో ఫీజులు వసూలు చేస్తారని వామపక్ష పార్టీల నాయకులు అపోహ పడుతున్నారన్నారు. కోరమాండల్ కంపెనీ యజమాన్యం సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా ఎఫ్ఆర్‌యూలో నిర్వహణ బాధ్యతలు తీసుకుంటామని, సాధారణ రుసుం వసూలు చేస్తామని చెప్పిందన్నారు. కానీ ఇందుకు ప్రభుత్వం అంగీకరించ లేదని స్పష్టం చేశారు. ఒకవేళ వారు ఉచితంగా సేవలందించకపోతే జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ఆస్పత్రిని నడుపుతామని చెప్పారు.

98వ వార్డు టీడీపీ పరిశీలకుడిగా సోమునాయుడు


ఎమ్మెల్యే గంటాను కలిసిన సోమునాయుడు

పెదగంట్యాడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ 98వ వార్డు పరిశీలకుడిగా టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా వ్యవహరిస్తున్న పెద్దాడ సోమునాయుడు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చయాలని గంటా సూచించారు.

ఎస్ఆర్‌పురంలో 'ఉపాధి' నిధులతో ప్లాంటేషన్


మొక్క నాటుతున్న అధికారులు

పెందుర్తి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో భాగంగా నియోజకవర్గంలోని గ్రామాల్లో కూలీలకు పని కల్పించే లక్ష్యంతో మండలంలోని ఎస్ఆర్‌పురంలో ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, అటవీ ప్రాంతాల అభివృద్ధి, చెట్ల పెంపకం ప్రణాళికలో భాగంగా 14.08 ఎకరాల్లో 3,273 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ ఆంజనేయులు, జిల్లా ఉద్యానవన అధికారి శ్యామల, పెందుర్తి ఉద్యానవన అధికారి సోనీ, ఎంపీడీవో గుండాల అప్పలరాజు, సర్పంచ్ దూది విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అద్దెకు వీఎంఆర్‌డీఏ కల్యాణ మండపాలు

విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్‌డీఏ నిర్మించిన కల్యాణ మండపాలను నెలసరి అద్దె చెల్లింపు ప్రాతిపదికన ఇచ్చేందుకు సంస్థ నిర్ణయించింది. కల్యాణ మండపాలు బహిరంగ వేలం విధానంలో అద్దెకు ఇచ్చే గడువు తేదీని ఈ నెల 17 వరకు పొడిగించినట్టు సదరు అధికారులు మంగళవారం తెలియజేశారు. కల్యాణ మండపాల విస్తీర్ణం, అద్దె, వీఎంఆర్‌డీఏ అప్సెట్ ధర తదితర అంశాలు వీఎంఆర్‌డీఏ వెబ్‌సైట్ వీఎంఆర్‌డీఏ.జీవోవీ.ఇన్ లో పొందుపరిచినట్టు వివరించారు.

యారాడలో సమస్యలపై 'పల్లా'కు వినతి


పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేస్తున్న యారాడ గ్రామస్థులు

మల్కాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : యారాడలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఆ గ్రామానికి చెందిన పలువురు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయనను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా యారాడ గ్రామంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలయ్యేలా చూడాలని, టూరిజం స్పాట్‌ను అభివృద్ధి చేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని విన్నవించారు. 64వ వార్డు టీడీపీ ఉపాధ్యక్షుడు తొత్తరి శ్రీను, సీనియర్ నాయకులు పిల్లా అచ్చారావు, బంక గణేష్, రాంపల్లి సతీష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు 90 ప్రత్యేక బస్సులు : డీఎం

వేపగుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం గిరి ప్రదక్షిణను పురస్కరించుకొని సింహాచలం డిపో నుంచి బుధ, గురువారాల్లో 90 ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నామని డిపో మేనేజర్ ఎస్.శరత్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ బస్సుల్లో 40 బుధవారం సింహాచలం కొండపైకి పెయిడ్ సర్వీసులుగా నడుస్తాయన్నారు. గురువారం 50 ప్రత్యేక బస్సులు సింహాచలం కింద నుంచి కొండపైకి ఉచితంగా నడపనున్నట్టు చెప్పారు. ఈ సౌకర్యాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు పూర్తి

- 3వేల మంది పోలీసులతో బందోబస్తు
- సింహాచలంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్



సింహాచలంలో మంగళవారం రాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సింహగిరి ప్రదక్షిణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లన్నీ పూర్తి చేసింది. భక్తులు మొత్తం 32 కి.మీ. దూరం కాలినడకన గిరి ప్రదక్షిణ చేస్తారు. సుమారు ఐదు నుంచి ఆరు లక్షల మంది హాజరవుతారని భావించి ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మూడు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి 6 కి.మీ.కు అధికారులతో బృందాన్ని పెట్టారు. ఎక్కడికక్కడ తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం కల్పించారు. ఏదైనా అవసరమైతే ఫోన్ ద్వారా చెప్పడానికి టోల్ ఫ్రీ నంబర్లను దారిపొడవునా డిస్‌ప్లే చేశారు. అలాగే మార్గంలో 750 విద్యుద్దీపాలు, 32 ప్రాంతాల్లో 200 వాట్స్ సామర్థ్యం కలిగిన హైమాస్ట్ లైట్లను అమర్చారు. తొలి పావంచా వద్ద కొబ్బరి కాయలు కొట్టడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కొండపైకి వెళ్లేందుకు 50 బస్సులను ఉచితంగా నడుపుతున్నారు. పాఠశాలలు, కల్యాణ మండపాలను గుర్తించి 14చోట్ల విశ్రాంతి మందిరాలుగా సిద్ధం చేశారు. కాగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మంగళవారం రాత్రి సింహాచలం వెళ్లి ఏర్పాట్లు పరిశీలించారు. జేసీ మయూర్ అశోక్ అప్పుఘర్ వద్దకు స్నానఘట్టం ఏర్పాట్లను తనిఖీ చేశారు.



సింహాచలంలో సీసీ టీవీల రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్



గిరిప్రదక్షిణకు సిద్ధమైన స్వామివారి రథం



సింహాచలంలో ఏర్పాటు చేసిన క్యూ లైన్లు



సెంట్రల్ జైలు సమీపంలో భక్తులు సేదతీరేందుకు వేస్తున్న టెంటు



అడవివరం వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక టాయిలెట్లు



వెంకోజీపాలెం వద్ద జాతీయ రహదారిపై భక్తులు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బారికేడ్లు



జిల్లాలో ప్రారంభమైన ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త భారత్ అభియాన్ ప్రొగ్రామ్

టీబీని తరిమేద్దాం



- వ్యాధి బారినపడే అవకాశమున్న వర్గాలకు పరీక్షలు
- కళ్లె పరీక్ష, ఎక్స్‌రే ద్వారా బాధితుల గుర్తింపునకు కార్యాచరణ
- ఇప్పటికే 2,106 మందికి పరీక్షలు
- 58 మందికి వ్యాధి నిర్ధారణ

విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): **దేశంలో టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త కార్యాచరణకు సిద్ధమయ్యాయి. కొన్నాళ్లుగా టీబీని నిర్మూలించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన ఫలితాలను సాధించలేని పరిస్థితి ఏర్పడింది. ఈసారి వచ్చే ఐదేళ్ల నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ దేశం నుంచి ఈ వ్యాధిని పారదోలడమే లక్ష్యంగా ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త భారత్ అభియాన్ ప్రొగ్రామ్‌కు శ్రీకారం చుట్టాయి.**



ఇందులో భాగంగా టీబీ సోకేందుకు అవకాశమున్న వర్గాలను గుర్తించి, వారికి ముందుగానే పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. సకాలంలో బాధితులను గుర్తించి మెరుగైన వైద్య సేవలు, పోషకాహారాన్ని అందించడం ద్వారా త్వరితంగా కోలుకునేలా చేయవచ్చని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. జిల్లాలో ఇప్పటికే ఈ ప్రొగ్రామ్ ప్రారంభమైంది. మరికొన్ని వారాలపాటు నిర్వహించనున్నారు. ఇప్పటికే గుర్తించిన కొన్నివర్గాలకు చెందిన 3,77,298 మందికి టీబీ నిర్ధారణ చేసే కళ్లె పరీక్ష, ఎక్స్‌రే తీయనున్నారు. ఈ జాబితాలో 60 ఏళ్లు దాటిన వృద్ధులు, పోషకాహారలోపంతో బాధపడుతున్న వారు, మధుమేహ వ్యాధిగ్రస్థులు, హెచ్ఐవీ బాధితులు, ధూమపానం, మద్యపాన ప్రియులు, పాత టీబీ రోగులు, టీబీ రోగులతో మూడేళ్లుగా కాంటాక్ట్‌లో ఉన్న (కుటుంబ సభ్యులు, స్నేహితులు) వారికి పరీక్షలు నిర్వహించనున్నారు. వీరికి ఆశా, ఏఎన్ఎం, స్థానిక మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో 104 వాహనంలో వచ్చే సిబ్బంది ద్వారా లేదా జిల్లాలో తొమ్మిది చోట్ల ఉన్న టీబీ యూనిట్స్‌లో గానీ పరీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటివరకు జిల్లాలో గుర్తించిన వర్గాల నుంచి 2,106 మందవికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 1,765 మందికి కళ్లె పరీక్ష నిర్వహించగా, 271 మందికి ఎక్స్‌రే చేశారు. లక్షణాలున్న వారికి కళ్లె పరీక్ష, లేని వారికి ఎక్స్‌రే చేసి వ్యాధిని నిర్ధారిస్తారు. ఇప్పటివరకు పరీక్ష నిర్వహించిన వారిలో 58 మందికి టీబీ ఉన్నట్టు నిర్ధారణ అయింది. వీరికి మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు పోషకాహారాన్ని అందించే ఏర్పాట్లు అధికారులు చేస్తున్నారు.

ఈ లక్షణాలుంటే..

టీబీతో బాధపడే వారిలో రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రి వేళ చెమటలు పట్టడం, దగ్గితే రక్తం పడడం, ఛాతిలో నొప్పి, శ్వాస ఆడకపోవడం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, అలసట, మెడలో వాపు వంటి లక్షణాలుంటాయి. వీటితోపాటు కొందరిలో కీళ్ల నొప్పి, వెన్ను నొప్పి, తలనొప్పి, గందరగోళంగా అనిపించడం లాంటివి ఎప్పటికప్పుడు వేధిస్తుంటే అనుమానించాల్సిందేనని నిపుణులు చెబుతున్నారు.

టీబీ నిర్మూలనే లక్ష్యం



టీబీని పూర్తిగా నిర్మూలించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వాలు ఈ ప్రొగ్రామ్‌కు శ్రీకారం చుట్టాయి. జిల్లాలో యాక్షన్‌ప్లాన్‌ను సిద్ధంచేసి అమలు చేసేలా సిబ్బందికి ఆదేశాలు జారీచేశాం. క్షేత్రస్థాయిలో పరీక్షలు నిర్వహించే సిబ్బందికి ఇప్పటికే శిక్షణ అందించాం. ఇప్పటి వరకు 58 కేసులను గుర్తించాం. మిగిలిన వారికి వీలైనంత త్వరగా పరీక్షలు నిర్వహిస్తాం. జిల్లాలో ప్రస్తుతం 1,874 పాజిటివ్ కేసులున్నాయి. వీరికి ముందులివ్వడంతో పాటు పోషకాహారం తీసుకునేందుకు నెలకు రూ.వెయ్యి చొప్పున అందిస్తున్నాం. మరో రూ.700 విలువజేసే పోషకాలతో కూడిన ఆహారాన్ని స్వచ్ఛంద సంస్థల సహకారంతో పంపిణీ చేస్తున్నాం. కొత్తగా వ్యాధికి గురయ్యే వారికి మెరుగైన వైద్య సేవలందించి వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం.

- డాక్టర్ రోణంకి రమేష్, జిల్లా టీబీ నియంత్రణ అధికారి

అప్పన్నను దర్శించుకున్న హోం మంత్రి అనిత



మంత్రికి చిత్రపటం అందజేస్తున్న ఈవో

సింహాచలం, జూలై 8(ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామిని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణ మంగళవారం దర్శించుకున్నారు. మంత్రికి ఈవో వి.త్రినాథరావు, కలెక్టర్‌కు పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నాక వారి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనాలు, అధికారులు స్వామివారి ప్రసాదాలను వారికి అందజేశారు.

తల్లి మందలించిందని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

మహారాణిపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందని ఓ బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. వన్‌టౌన్‌లోని పండా వీధిలో నివాసం ఉంటున్న పి.జశ్వంత్ (17) ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు, తల్లి కనకమహాలక్ష్మి ఒక ప్రైవేటు సంస్థలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తోంది. జశ్వంత్ అల్లరిచిల్లరగా తిరుగుతున్నాడని తల్లి కాస్త మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన జశ్వంత్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన స్థానికులు వెంటనే కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొట్లాట ఘటనలో ఆరుగురు యువకుల అరెస్టు

గోపాలపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం రామాలయం ఎదురుగా జరిగిన కొట్లాట ఘటనలో ఆరుగురు యువకులను గోపాలపట్నం పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. కొత్తపాలెం ప్రధాన రహదారిలోని గౌరీ రామాలయం ఎదురుగా ఉన్న ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద ఆదివారం రాత్రి పది గంటల సమయంలో స్థానికంగా ఉన్న కొందరు యువకుల మధ్య వివాదం జరిగిన విషయం తెలిసిందే. కందక సూర్య, సాయి అనే ఇద్దరు యువకులు గొడవ పడుతున్న సమయంలో అక్కడున్న సరపాక రాజేశ్ అనే యువకుడు వీరిని విడిపించే యత్నం చేశాడు. ఇంతలో అక్కడకు వచ్చిన సూర్య సోదరుడైన సురేంద్ర రాజేశ్‌తో వాగ్వాదానికి దిగాడు. ఇది చూసిన సమీపంలో ఉన్న సూదికొండ మణికంఠ, లంక రమణ, అమరపిన్ని కనకరాజు విడిపించే యత్నం చేశారు. ఈ క్రమంలో సురేంద్రతో పాటు అతని సోదరుడైన సూర్య, అతని మిత్రులైన దాడి లిఖిత్, శిలపరశెట్టి అక్షయ్, కొడగట్ల సతీశ్, రీసు ఆనంద్‌లు కలిసి రాజేశ్, మణికంఠ, రమణ, కనకరాజుపై దాడికి దిగారు. వీరిలో సురేంద్ర, సూర్య, లిఖిత్ అనే ముగ్గురు కత్తులతో దాడి చేయడంతో రాజేశ్, కనకరాజులకు తీవ్రంగా గాయాలయ్యాయి. వీరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాజేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.వి.ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ రామారావు బృందం పరారీలో ఉన్న ఆరుగురు నిందితుల్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

సీతంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజేంద్రనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న తోట రాహుల్ (20) అనే యువకుడు మనస్తాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజేంద్రనగర్‌లో శ్రీకుంజ అపార్టుమెంట్‌లో తోట నాగరాజు భార్య, కుమారుడితో నివాసం ఉంటున్నారు. నాగరాజు రైల్వే ఉద్యోగి. ఆయన భార్య విజ్ఞాన్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. రాహుల్ గీతం కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. రాహుల్ చదువులో మంచి మార్కులతోనే రాణించేవాడు. అయితే సోమవారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో వంట గదిలోని ఫ్యాన్ కొక్కానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విధులు ముగించుకుని ఇంటికి వచ్చేసరికి ఉరి వేసుకున్న రాహుల్‌ను చూసి అతడి తల్లి భర్తకు ఫోన్ చేసి సమాచారాన్ని అందించారు. ఆయన ఇంటికి చేరుకుని ద్వారకా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ ధర్మేంద్ర సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. సమాజంపై విరక్తి కారణంగా మనస్తాపంతో తమ కుమారుడు ఉరి వేసుకున్నాడని రాహుల్ తండ్రి పోలీసులకు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా చదువులో ఇంకా రాణించాలని, మార్కులు ఎక్కువ రావాలని రాహుల్ వేధింపులకు గురైనట్టు స్థానికులు చెబుతున్నారు.

3 వేల కిలోల రేషన్ బియ్యం పట్టివేత

ఎంవీపీ కాలనీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఇసుకతోట కూడలి వద్ద మంగళవారం తెల్లవారు జామున ఒంటి గంటకు టాస్క్‌ఫోర్స్, ఎంవీపీ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టి వ్యానులో తరలిస్తున్న 3 వేల కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. వ్యాను డ్రైవర్ కోరాయి గోపాలకృష్ణను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, హెచ్‌బీ కాలనీ, సింహాద్రిపురం ప్రాంతాల్లో బియ్యం కొనుగోలు చేసిన సాయి అనే వ్యక్తి ఈ బియ్యం వాహనంలో రవాణా చేస్తున్నట్టు తెలిపాడు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ భరత్‌కుమార్, పౌర సరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్ డి.జానకి, ఎంవీపీ పోలీసులు తనిఖీల్లో పాల్గొన్నారు. ఎస్ఐ ధనుంజయనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రో వర్సిటీలో 'సైంటిఫిక్ ఫెలోషిప్' ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న వర్సిటీ ప్రొఫెసర్లు, విద్యార్థులు

విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) స్కూల్, కాలేజీ విద్యార్థులకు ఫెలోషిప్ ప్రొగ్రామ్ మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఈ నెల 11 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. సైంటిఫిక్ సోషల్ రెస్పాన్సిబులిటీ ప్రొగ్రామ్‌లో భాగంగా స్థానిక కాలేజీ, స్కూల్ విద్యార్థులకు ఈ ఫెలోషిప్ ప్రొగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో వివిధ పాఠశాలలు, కళశాలలన నుంచి ఎంపిక చేసిన 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం వంటి రంగాల్లో విద్యార్థులకు వివిధ అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తారు.

ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన పెట్రోలియం వర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ మాట్లాడుతూ ఈ తరహా కార్యక్రమాలతో విద్యార్థుల్లో ఉన్న నాలెడ్జ్ తారతమ్యాన్ని తగ్గించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. పాఠశాల విద్యార్థులకు స్టెమ్ రంగాల్లో భవిష్యత్తు అవకాశాలను తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమ సమన్వయకర్త ప్రొఫెసర్ రంధి రామునాయుడు మాట్లాడుతూ అనకాపల్లి, విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల కలెక్టర్లకు, ఆయా జిల్లాల డీఈవోలకు విద్యార్థుల ఎంపికలో చూపించిన సహకారానికి గాను కృతజ్ఞతలు తెలిపారు. ఆర్అండ్‌డీ డీన్ ప్రొఫెసర్ కె.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఐఐపీఈ నిర్వహిస్తున్న శాస్త్రీయ, సామాజిక బాధ్యత కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు దీర్ఘకాలిక లాభాలు లభిస్తాయన్నారు. ఐఐపీఈ రిజిస్ట్రార్ శ్రీరామ్ పాల్ ద్వివేది మాట్లాడుతూ విద్యార్థులు తమ కెరీర్‌కు సంబంధించి సరైన సమయంలో తగిన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేట్ ఆర్అండ్‌డీ డీన్, కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ పొలమరశెట్టి అపరేయ్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిళ్లు, పుస్తకాలు, స్టేషనరీ సామాగ్రిని పంపిణీ చేశారు. ముగింపు కార్యక్రమం నాడు ప్రతి విద్యార్థికి రూ.2 వేల చొప్పున ఫెలోషిప్ ఇస్తామని ప్రొఫెసర్ రామునాయుడు తెలిపారు.

12 నుంచి రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు

విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆల్ విశాఖ చెస్ సంఘం, ఏపీ చెస్ సంఘం సంయుక్తంగా ఈనెల 12, 13వ తేదీల్లో రాష్ట్ర స్థాయి అండర్-15 బాలికలు, ఓపెన్ విభాగాల చదరంగం టోర్నీ నిర్వహిస్తున్నాయని సంఘం కార్యదర్శి మణికంఠరావు మంగళవారం తెలిపారు. నగరంలోని ద్వారకానగర్ వద్ద బీవీకే కాలేజి వేదికగా జరిగే ఈ టోర్నీలో పాల్గొనేవారు జనవరి ఒకటి, 2010 ఆ తర్వాత జన్మించి ఉండాలని స్పష్టం చేశారు. ఈ టోర్నీలో ఓపెన్, బాలికల విభాగాలలో తొలి రెండు స్థానాలలో నిలిచినవారు నవంబరు 2 నుంచి ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న జాతీయ అండర్-15 చెస్ టోర్నీలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్న ఈ టోర్నీకి క్యాండిట్ నైట్స్ చెస్, ఆదిత్య చెస్ అకాడమీలు రూ.60 వేలు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్:7010319715, 9676636661, 9849371760 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

జగన్నాథుని హుండీ ఆదాయం రూ. 19.42 లక్షలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, అధికారులు

మహారాణిపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవాల సందర్భంగా పది రోజులకు వచ్చిన హుండీ ఆదాయం రూ. 19,42,570 రూపాయల వచ్చినట్టు ఆలయ కార్యనిర్వాహక అధికారి టి.రాజగోపాల రెడ్డి తెలిపారు. పది రోజులుగా నిర్వహిస్తున్న రథయాత్ర ముగియడంతో మంగళవారం ప్రధాన ఉత్సవ అధికారి టి.అన్నపూర్ణ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా రథయాత్ర ద్వారా రూ. 19.42 లక్షలు ఆదాయం వచ్చిందని, సంవత్సరం మొత్తం మీద రూ. 90.42 లక్షలు వచ్చిందని తెలిపారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది రూ.4.90 లక్షలు ఆదాయం అధికంగా వచ్చినట్టు తెలిపారు. ఈనెల 14న దేవస్థానం ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.